సూర్య
దినపత్రిక
గుంటూరు పల్నాడు
www.suryaa.com
శనివారం 13 డిసెంబర్ 2025 - పేజీలు 10



# స్థలం ఒక సర్వే నెంబర్..
# రిజిస్ట్రేషన్ మరో సర్వే నెంబర్..!

- అక్రమార్కులకు కీలక నేత సహాయకుని దన్ను..
- ఒక్కొక్క రిజిస్ట్రేషన్ కు ఒక్కొక్క ధర..
- పాత స్టాంపులకు వేలల్లో, కొత్త స్టాంపులకు పదుల్లో అదనపు ఫీజు..
- జిల్లా రిజిస్ట్రార్ పేరుతోనూ మామూళ్లు
- ఏసీబీ దాడులు తమపై జరగవంటున్న కార్యాలయం ఉద్యోగులు..




గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ : స్థలం ఒక సర్వే నెంబర్..రిజిస్ట్రేషన్ మరో సర్వే నెంబర్ లో చేయించుకునేందుకు ముందస్తుగానే రిజిస్ట్రేషన్ శాఖ అధికారితో పాటు, రెవిన్యూ శాఖ అధికారి సహాయ సహకారాలు చేసుకుంటూ కూటమి ప్రభుత్వంలోని కీలక మంత్రి ఇలాఖాలో అక్రమ రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయి. తప్పు అని తెలిసిన ఓ మంత్రికి సహాయకునిగా ఉన్న వ్యక్తి వెనక ఉండి అక్రమార్కులకు, కబ్జా దారులకు పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందిస్తున్నట్టుగా వినికిడి. ఈ విధంగా అక్రమంగా అర్జించిన సొత్తులో కొంత భాగాన్ని జిల్లా కార్యాలయానికి కూడా పంపుతున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి.

7 లో

## వ్యవసాయం లాభదాయక పరిశ్రమగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లా సమగ్ర వ్యవసాయ ప్రణాళిక రూపొందించాలి - కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా



గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్: జిల్లా సమగ్ర వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. రైతన్నా ! మీ కోసం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల జిల్లా స్థాయి సదస్సు ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళికలో భాగంగా వ్యవసాయం లాభదాయక పరిశ్రమ స్థాయిలో ఉండాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ప్రతీ ఎకరాకు మంచి ఆదాయం లభించాలన్నారు. ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని వీటిని వినియోగించుకుని సమగ్ర కార్యాచరణ

2 లో..

## నాయకురాలు నాగమ్మ ఆలయాన్ని సందర్శించిన పల్నాడు కలెక్టర్

కమిటీ విజ్ఞప్తికి సానుకూల స్పందన

**దాచేపల్లి, మేజర్ న్యూస్:** పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా శుక్రవారం దాచేపల్లి మండలం లోని గామాలపాడు లో నాయకురాలు నాగమ్మ నిర్మించిన శ్రీ చెన్న మల్లిఖార్జున స్వామి ఆలయాన్ని సందర్శించారు.టిటిడి పాలక మండలి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పల్నాడు చరిత్ర, అభివృద్ధి కమిటీ సభ్యులు ఎంతో చరిత్ర కల్గిన శ్రీ చెన్న మల్లిఖార్జున స్వామి ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసి ఆ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు నిర్మాణాలు

2 లో




## అర్హులైన పౌరులందరికీ సంక్షేమ పథకాలు

- ఏపీ సచివాలయం ప్లానింగ్ డైరెక్టర్ విజయలక్ష్మి

**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్:** అర్హులైన పౌరులందరికీ సంక్షేమ పథకాలు, సేవలను సజావుగా అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని పౌర సేవలను కేటగిరీ-ఎ కిందకు తీసుకురావాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని కుటుంబాల సమాచారాన్ని ధృవీకరించడం చాలా అవసరం. దీనిని సులభతరం

2 లో

## ప్రకృతి వ్యవసాయం... ఆరోగ్యానికి ఆహ్వానం

- దేశవాళీ విత్తనాలు ఆరోగ్యానికి వరప్రదమని
- రైతన్నా ! మీ కోసం కార్యక్రమంలో రైతులు





గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్: ప్రకృతి వ్యవసాయం, దేశవాళీ విత్తనాలు ఆరోగ్యానికి వరప్రదమని పలువురు రైతులు వివరించారు. రైతన్నా ! మీ కోసం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల జిల్లా స్థాయి సదస్సు ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రగతిశీల రైతులు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు, వ్యవసాయ ఉత్పాదక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో మంచి ఫలితాలు పొందుతున్నామని చెప్పారు. కొంత మంది రైతుల అభిప్రాయాలు. మంగళగిరి మండలంకు చెందిన ప్రగతిశీల రైతు టి.శివరాం రెడ్డి మాట్లాడుతూ భూసారాన్ని పరిరక్షించుటకు కేవలం పొటాష్ మాత్రమే వినియోగిస్తానని చెప్పారు. వివిధ రకాల అరటి తోటలు పెంపకంతో పాటు ఇతర పంటలు వేస్తామని చెప్పారు. నాలుగు వందల మంది రైతులకు కొవ్వూరు అరటి పరిశోధన కేంద్రం నుంచి నాణ్యమైన విత్తనాలు అందించామని అన్నారు. ప్రతీ ఎకరాకు మూడు, నాలుగు లక్షల రూపాయలు ఆదాయం వస్తుందని, ఎకరాకు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడులు పెట్టాలని తెలిపారు.

2 లో

# నాయకురాలు నాగమ్మ ఆలయాన్ని సందర్శించిన పల్నాడు కలెక్టర్

**మొదటి పేజీ తరువాయి**

ప్రారంభించిన నేపథ్యంలో ఆలయం, ఆలయం క్రింద ఉన్న సుమారు 18 ఎకరాల భూమి కేంద్ర పురావస్తు శాఖ అధీనంలో ఉన్నందున,ఆ భూమి లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టేందుకు అడ్డంకి ఏర్పడింది.ఈ క్రమం లో జంగా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పల్నాడు చరిత్ర, అభివృద్ధి కమిటీ సభ్యులు కేంద్ర పురావస్తు శాఖ అధీనంలో ఉన్న 18 ఎకరాల భూమి లో పురావస్తు సంపద ఉన్న భూమిని తప్పించి మిగిలిన భూమి ని రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవలసినదిగా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.జంగా, కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు కలెక్టర్ కృతికా శుక్లా శుక్రవారం గామాలపాడు గ్రామం లోని నాయకురాలు నాగమ్మ నిర్మించిన శ్రీ చెన్న మల్లిఖార్జున స్వామి ఆలయాన్ని సందర్శించి జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు బెహరా శ్రీనివాసరావు ప్రాంగణం లో నిర్మిస్తున్న పలు ఆలయాలకు సంబంధించిన వివరాలను కలెక్టర్ కు వివరించారు.సుమారు 1200 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ ఆలయాన్ని పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర పురావస్తు శాఖ అధీనంలో ఉన్న భూమిని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పల్నాడు చరిత్ర, అభివృద్ధి కమిటీ కి అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కమిటీ సభ్యుల విజ్ఞప్తి పై సానుకూలంగా స్పందించిన కలెక్టర్



స్థానిక రెవెన్యూ అధికారుల ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ మేరకు నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.అంతకుముందు ఆలయం వద్దకు చేరుకున్న కలెక్టర్ కు సర్పంచ్ జంగా సురేష్, కమిటీ సభ్యులు, గ్రామస్థులు పూర్ణ కుంభం తో స్వాగతం పలికారు.ఈ కార్యక్రమం లో గురజాల ఆర్డీవో మురళి కృష్ణ,కమిటీ సభ్యులు, దాచేపల్లి నగర పంచాయతీ కౌన్సిలర్ షేక్ షరీఫ్,మాశెట్టి బుజ్జి,బత్తుల వెంకయ్య, జంగా సైదులు, తోట వెంకటేశ్వర్లు,గద్దల వేదమణి, స్థానిక రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బంది వినతుల పరిష్కారానికి చర్యలు

– జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

**గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్:** పోలీసు అధికారులు సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సూచించారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే "పోలీస్ స్టాఫ్ గ్రీవెన్స్ డే" కార్యక్రమం జరిగింది.జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ సర్వీసు, బాధ్యతలు, విధి పంపిణీ, బదిలీల (ట్రాన్స్ఫర్లు)కు సంబంధించిన సమస్యలను ఎస్పీ కి వినతి పత్రాల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది అందించిన వినతులను ఎస్పీ సావధానంగా పరిశీలించారు. సమస్యల తీరును అర్థం చేసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత విభాగాధిపతులకు తక్షణ సూచనలు ఇచ్చారు. జిల్లా పోలీస్ స్టేషన్లలో ఉన్న ఖాళీలు, స్థానిక అవసరాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని బదిలీలు పారదర్శకంగా, న్యాయంగా చేపడతామని ఎస్పీ సూచించారు. విధులు నుంచి తొలగించబడిన సిబ్బంది కి విచారణ అనంతరం నిబంధనల మేరకు పోస్టింగ్ లు కేటాయిస్తామని పేర్కొన్నారు.



# వ్యవసాయం లాభదాయక పరిశ్రమగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం



**మొదటి పేజీ తరువాయి**

ఉండాలన్నారు. సంబంధిత శాఖల మధ్య స్పష్టమైన సమన్వయం అవసరమని, లక్ష్యాల సాధనకు సంబంధిత రంగాలలో పనిచేస్తున్నారని భాగస్వామ్యం చేయాలని సూచించారు. నీటి యాజమాన్యం, గిరాకీ ఆధారంగా పంటలు వేయడం, వ్యవసాయ సాంకేతికతను, డ్రోన్లు వినియోగించుకోవడం వంటి అంశాలు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల పరిధిలో అటువంటి డాక్యుమెంట్ లు ప్రదర్శించాలని అన్నారు. వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. పద్మావతి మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్లో 70,663 ఎకరాల సాధారణ విస్తీర్ణంకు గాను ఇప్పటి వరకూ 11,395 ఎకరాలలో పంటలు వేయడం జరిగిందన్నారు. జిల్లాలో దాదాపు మూడు లక్షల ఎకరాలకు సాగునీటి వసతులు లభ్యంగా ఉందన్నారు. వేసవి కాలంలో పంటలు వేసుకోవడం వలన స్థూల విలువ ఆధారిత పెంచవచ్చని చెప్పారు. చిరు ధాన్యాల పంటలు కూడా సాగు చేయాలని అన్నారు. డ్రోన్ సాంకేతికత, ఆధునిక వ్యవసాయ సాంకేతికత అవలంభించాల్సిన అవసరం ఉందని వివరించారు. వ్యవసాయ ముఖ్య శాస్త్రవేత్త డా.సి.వి.రమణ మాట్లాడుతూ రైతుకు మంచి ధర రావడం వలన మిరప సాగు విస్తీర్ణం పెరగగలదని అన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్ మాట్లాడుతూ పంట పొలాల గట్లు బలోపేతం చేయుటకు అవకాశం ఉందని తెలిపారు. పొలాల్లో పంట కుంటలు ఏర్పాటు చేయడం వలన మంచి ప్రయోజనం కలుగుతుందన్నారు. పశుదానా పెంచుకొనే అవకాశం ఉపాధి హామీ పథకంలో అవకాశం ఉందని తెలిపారు. ఈ సదస్సులో పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు, జిల్లా మత్స్య శాఖ అధికారి పి.ఎన్.కిరణ్ కుమార్, శాస్త్రవేత్తలు చంద్రమోహన్ రెడ్డి, శైలజ, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, మంగళగిరి మండలంకు చెందిన ప్రగతిశీల రైతు టి.శివరాం రెడ్డి, ప్రగతిశీల రైతు శ్రీధర్ (కొల్లిపర), మిరప ఎగుమతుల సంఘం కార్యదర్శి తోట రామకృష్ణ, వట్టిచెరుకూరుకు చెందిన నాదెండ్ల ధనుంజయ రావు, మోహన్ రెడ్డి, వై.బాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయం... ఆరోగ్యానికి ఆహ్వానం



**మొదటి పేజీ తరువాయి**

మండలంలో సూక్ష్మ సాగు నీటి పథకం మొట్టమొదటగా వినియోగించానని, అనంతరం ఇతరులు ప్రారంభించారని చెప్పారు. ప్రగతిశీల రైతు శ్రీధర్ (కొల్లిపర) మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేపడుతున్నామని, ఇందుకు కాషాయాలు తయారు చేసుకోవడం జరుగుతుందన్నారు. మిరప ఎగుమతుల సంఘం కార్యదర్శి తోట రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచానికి అవసరమగు మిరపలో మన దేశం 33 శాతం అందిస్తుందన్నారు. దేశంలో మిరప పరిశోధన కేంద్రం లేదని, విత్తన బ్యాంకు లేదని అన్నారు. పెద్ద ఎత్తున సాగు చేస్తున్న మిరపకు సరైన బోర్డు, చట్టం లేదని ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వట్టిచెరుకూరుకు చెందిన నాదెండ్ల ధనుంజయ రావు మాట్లాడుతూ పురుగు మందులు వినియోగం వలన అనారోగ్యంపాలు కావడం జరుగుతుందన్నారు. "సుభాష్ పాలేకర్ మా ప్రాంతం సందర్శించడం, ఒక గోవు ఉంటే ఎన్నో రకాల వ్యవసాయ విధానాలను అవలంబించవచ్చని " చెప్పడంతో ఆయన స్ఫూర్తితో రెండు ఎకరాల భూమిని ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఎకరాకు 35 నుండి 40 బస్తాల ధాన్యం దిగుబడి సాధిస్తున్నామన్నారు. భూమి ఆరోగ్యం కాపాడుటకు జీవామృతం తయారు చేయడం, తూటాకు కాషాయం వంటి వాటిని తయారు చేసి వినియోగిస్తున్నామని చెప్పారు. దుగ్గిరాల మండలంకు చెందిన మోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం స్థాయిలో పంటల సేకరణ ఉండాలన్నారు.

# అర్హులైన పౌరులందరికీ సంక్షేమ పథకాలు

**మొదటి పేజీ తరువాయి**

చేయడానికి, కుటుంబ ప్రయోజన నిర్వహణ వ్యవస్థ కింద ఏకీకృత కుటుంబ సర్వేను నిర్వహించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ సర్వేలో, పౌరుల అందరి నుండి సమాచారాన్ని గ్రామ/వార్డ్ సచివాలయ స్థాయిలో జీవిస్ డబ్ల్యూ ఎస్ సిబ్బంది ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా సేకరిస్తారు. ఈ కార్యాచరణలో భాగంగా, డిసెంబర్ 11, 12 తేదీలలో గుంటూరులో నాలుగు సెషన్లలో రాష్ట్ర స్థాయి శిక్షకుల శిక్షణ (టిఓటి) కార్యక్రమం నిర్వహించబడినది. నిర్దేశించిన ప్రశ్నాపత్రం ద్వారా వ్యక్తిగత, కుటుంబ స్థాయి సమాచారాన్ని సేకరించడానికి వివరణాత్మక విధానాలను ఈ శిక్షణలో వివరించడం జరిగినది. శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు తరువాత గ్రామ/వార్డ్ సెక్రటేరియట్ స్థాయిలో మిగిలిన జీవిస్ డబ్ల్యూ ఎస్ సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఏ.పి. సెక్రటేరియట్ ప్రణాళిక విభాగం డైరెక్టర్, జీవిస్ డబ్ల్యూ ఎస్ శాఖ సీనియర్ అధికారులతో కలిసి, రెండు రోజుల రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో, జె. విజయలక్ష్మి, ప్లానింగ్ డైరెక్టర్ ,ఆంధ్రప్రదేశ్ సచివాలయం వారు ఏకీకృత కుటుంబ సర్వే ప్రాముఖ్యతను స్పష్టంగా వివరించారు. సర్వేను యాంత్రికంగా నిర్వహించకూడదని, రాష్ట్రంలోని అర్హులైన పౌరులందరికీ భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయోజనాలను అందించాలనే విషయాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్త మరియు అవగాహనతో నిర్వహించాలని ఆమె నొక్కి చెప్పారు.

# 14న ఎస్ .హెచ్.ఓ.లో జీర్ణాశయ వ్యాధుల ఉచిత వైద్య శిబిరం

**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్:** సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్ ,మానవత స్వచ్ఛంద సేవా సంస్థసంయుక్తంగా ప్రతినెల రెండో ఆదివారం "స్పెషలిస్టుల ఉచితవైద్య శిబిరాల "లో భాగంగా 14వ తేదీ ఆదివారం "జీర్ణకోశ వ్యాధుల ఉచిత వైద్య శిబిరం, శాస్త్రీయ అవగాహన సభ "నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి .సేవకుమార్ ,పావులూరి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు 2/1 బ్రాడీపేట లోని ఎస్ .హెచ్. ఓ భవనంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో జీర్ణాశయ వ్యాధులవైద్య నిపుణులు డాక్టర్ బి.సాయి కృష్ణ పాల్గొంటారన్నారు. ఈ శిబిరానికి ముందు జీర్ణ వ్యవస్థ సంబంధ వ్యాధులు , గ్యాస్ ట్రబుల్, కడుపుబ్బరం, నొప్పి ,మంట, వికారం, వాంతులు, అజీర్ణం ,త్రేపులు, ఇరిటబుల్ బవెల్స్ సింద్రోమ్, ప్యాంక్రియాటిక్ వ్యాధులు, లివర్ వ్యాధులు, సిరోసిస్ జాండీస్, గాల్ బ్లాడర్ స్టోన్స్ తదితర సమస్యల చికిత్స విధానాలు,జీవన సరళలో మార్పులు, తదితర అంశాలపై శాస్త్రీయ అవగాహన సభ ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా వారు ఆ ప్రకటనలో కోరారు.



# దుర్గిలో శిల్పకళ శిక్షణా కేంద్రం ఘన ప్రారంభం

**దుర్గి మేజర్ న్యూస్:** పల్నాడు జిల్లా దుర్గి మండల కేంద్రంలో శిల్ప కళాభివృద్ధిని మరింతగా ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన శిల్ప కళ శిక్షణా కేంద్రంను జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతిక శుక్లా గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా దుర్గి శిల్పాలకు ఉన్న ప్రత్యేక గుర్తింపును, స్థానిక కళాకారులు కలిగిన అపూర్వ నైపుణ్యాన్ని ప్రశంసించారు.దుర్గి శిల్ప సంప్రదాయం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనే కాక దేశంలోని పలు ప్రాంతాల్లోనూ మంచి గుర్తింపు పొందిందని కలెక్టర్ అన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ కళను ఆధునిక సాంకేతికతతో అనుసంధానించి మరింత ప్రాచుర్యంలోకి తేవాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ శిక్షణా కేంద్రం యువతకు శిల్పకళలో అవకాశాలు సృష్టిస్తుందని, కళాకారుల ప్రతిభను రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయికి తీసుకెళ్లే వేదికగా నిలుస్తుందన్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో అధికారులు, స్థానిక కళాకారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థుల బస్సు సౌకర్యం కోసం వినతిపత్రం



**వినుకొండ మేజర్ న్యూస్:** విద్యార్థులు బస్సు సౌకర్యం కోసం డిపో మేనేజర్ కి వినతి పత్రం అందజేసిన వినుకొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళి యాదవ్.వినుకొండ శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ఆదేశాల మేరకు, తలార్లపల్లి పంచాయితీ నాయకులు ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. వినుకొండ నుండి జంగాలపల్లి మదమంచి పాడు దేవస్థానం కొత్త త్రిపురాపురం పాత త్రిపురాపురం, ,గొల్లపాలెం తలార్లపల్లి దాట్లవారిపాలెం, కమ్మవారిపాలెం మీదుగా నూజెండ్ల వరకు కొత్త బస్సు సర్వీసును తక్షణమే ప్రారంభించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. బస్సు సౌకర్యం లేక విద్యార్థిని విద్యార్థులు రోజువారీ ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను వారు డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. నాయకుల వినతిని పరిశీలించిన డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి, త్వరలోనే బస్సు సర్వీసును ఏర్పాటు చేసి విద్యార్థిని విద్యార్థిని విద్యార్థుల కష్టాలను తీరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కృషిలో వినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళి యాదవ్, సీనియర్ నాయకులు కుంట కోటిరెడ్డి, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ గుడిపూడి ఏసురత్నం, అళ్ల గురువారెడ్డి, మద్దిరెడ్డి కేశవరెడ్డి, మాదాల ఎలమంద తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలపై ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

**వినుకొండ మేజర్ న్యూస్:** ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు అన్నారు. వినుకొండ నియోజకవర్గ ప్రజల కోసం చీఫ్ విప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కు ప్రజల నుండి అనూహ్య స్పందన లభించింది. నియోజకవర్గం నలుమూలల నుండి ప్రజలు ప్రజా దర్బార్ కు హాజరై వారి సమస్యలను చీఫ్ విప్ జీవి ఆంజనేయులుకు విన్నవించుకున్నారు. ప్రతి ఒక్కరి సమస్యను అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపుతానని చీఫ్ విప్ జీవి పేర్కొన్నారు. 45 అర్జీలు వచ్చాయి వినుకొండ పట్టణముతోపాటు గ్రామాల్లో పింఛన్లు, భూ సమస్యలు, తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వివిధ వర్గాల ప్రజలు విన్నవించారు. ఫిర్యాదులను పరిశీలించిన చీఫ్ విప్ జీవి ఆంజనేయులు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కూటమి పాలనలో ప్రజలందరికీ సమన్యాయం జరుగుతుందని వివరించారు. సంక్షేమం అభివృద్ధి సమాంతరంగా నిర్వహిస్తూ ప్రజా ప్రభుత్వం గా ప్రజల మన్ననలు పొందిందన్నారు.

## ఆదిత్య మెడికవర్ ఎండీ డాక్టర్ పాకనాటి కృష్ణ శ్రవంత్ మానవత్వం

- రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ 2.5 లక్షల ఆర్థిక సహాయం
- భార్యకు అర్హత తగ్గ ఉద్యోగం ఇవ్వనున్నట్లు హామీ



**గుంటూరు సిటీ మేజర్ న్యూస్:** వైద్య రంగంలో సేవలతో పాటు మానవతా విలువలను నిలబెట్టే వ్యక్తిగా ప్రసిద్ధి గాంచిన ఆదిత్య మెడికవర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రముఖ ఎముకలు, కీళ్ల వ్యాధుల నిపుణులు జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ పాకనాటి కృష్ణ శ్రవంత్ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. గత రెండేళ్లుగా అదే ఆసుపత్రిలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా నిబద్ధతతో పని చేసిన రాధారావు నరేంద్రబాబు ఇటీవలి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవ్వడం ఆయన కుటుంబాన్ని తీవ్రంగా కుంగగొట్టింది. ఈ ఘటన తెలుసుకున్న డాక్టర్ కృష్ణ శ్రవంత్ శుక్రవారం నరేంద్రబాబు కుటుంబాన్ని పరామర్శించి వారికి రెండున్నర లక్షల చెక్ ను అందించారు.ఆ కుటుంబానికి ఆపత్కాలంలో అండగా నిలిచి, మానవతా హృదయం ఎలాంటిదో చూపించారు. వారికి తక్షణ ఉపశమనం కల్పించేందుకు రూ 2.5 లక్షల ఆర్థిక సహాయం అందించిన డాక్టర్ శ్రవంత్ నరేంద్రబాబు భార్యను వ్యక్తిగతంగా ధైర్యపరచి, ఆమె అర్హతలకు అనుగుణంగా ఆదిత్య మెడికవర్ హాస్పిటల్‌లో ఉద్యోగం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ నిర్ణయం కుటుంబానికి తిరిగి నిలబడే బలం, భవిష్యత్తుపై నమ్మకం ఇచ్చిందని హాస్పిటల్ సిబ్బంది పేర్కొన్నారు. తన సంస్థలో పనిచేసిన ఉద్యోగుల పట్ల బాధ్యత, వారి కుటుంబాల పట్ల చూపిన అనుబంధం, ఆపదలో అండగా నిలిచే హృదయం,ఇవి అన్ని డాక్టర్ కృష్ణ శ్రవంత్ వ్యక్తిత్వానికే అద్దం పడుతున్నాయి. ఆయన చర్య నరేంద్రబాబు కుటుంబానికి ఆశ అవ్వడమే కాకుండా, సమాజానికి సానుభూతి సేవల విలువలను చాటి చెప్పే గొప్ప సందేశంగా నిలుస్తోందని పలువురు వైద్యులు పేర్కొంటున్నారు. ఉద్యోగుల సంక్షేమం, మానవీయ విలువల పరిరక్షణలో ఆదిత్య మెడికవర్ హాస్పిటల్ మరోసారి తన ప్రత్యేకతను నిరూపించుకుంది. వైద్య రంగంలో ఇలాంటి మానుషత్వం అరుదుకు చేరిన ఈ కాలంలో డాక్టర్ శ్రవంత్ హృదయపూర్వక నిర్ణయం అందరి ప్రశంసలను అందుకుంటోంది. ఈ కార్యక్రమంలో ఆదిత్య మెడికవర్ హాస్పిటల్స్ ఎండి ప్రముఖ న్యూరాలజీ వైద్య నిపుణులు డాక్టర్ అమూల్య ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## డిఈఓ పివిజే రామారావుని కలిసిన దుర్గి ఎంఈఓ ఎండి.ఖాసీం

**గుంటూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్:** పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన పివిజే రామారావుని దుర్గి, వెల్దుర్తి మండలం విద్యాశాఖ అధికారిఎండి ఖాసీం నరసారావు పేటలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి పివిజే రామారావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో మారుమూల మండలాలైన వెల్దుర్తి, దుర్గి మండలాలను విద్యారంగంలో ముందుండే విధంగా కృషి చేయాలని ఆ దిశగా నా సహకారం ఉంటుందని అన్నారు మండలాలలో పదో తరగతి విద్యార్థులకు 100 రోజు ప్రణాళిక ప్రాథమిక స్థాయి విద్యార్థులకు 75 రోజుల ఎఫ్ ఎల్ ఎన్ ప్రణాళిక పక్కగా అమలుపరచాలని అన్నారు మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ తమరి ఆదేశాలు తప్పక పాటించి మండలాన్ని గత సంవత్సరం లాగా 10వ తరగతి ఫలితాల్లో ముందుండే విధంగా కృషి చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో పలనాడుఏపీఎంఓ శ్రీ పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు షేక్ జాను, మహబూబ్ సుభాని,నజీర్ మహేక్ తదితరులు పాల్గొన్నారు.





## వృద్ధాశ్రమంలో అన్న వితరణ

**పొన్నూరు, మేజర్ న్యూస్:** ఫ్రూట్ మినిస్ట్రీస్ వారి “యేసుక్రీస్తు వధువు గుడారము” 8వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం కసుక్రు లోని అమ్మ వృద్ధ ఆశ్రమంలో ఫ్రూట్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు రెవ. ప్రశాంతరాజు తుమ్మల వృద్ధులకు ఆహారం వితరణ చేశారు. ఆకలి గొన్నవారికి ఆహారం ఇవ్వండి అని బైబిల్ వాక్య ఆధారంగా మా మినిస్ట్రీ ద్వారా అనాథ వృద్ధులైన వారికి ఆహారం అందించడం మాకెంతో సంతోషాన్ని కలిగించిందని ఈ సందర్భంగా రెవ. ప్రశాంత రాజు తుమ్మల. అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

## బావిలో యువకుడి మృతదేహం లభ్యం



**మంగళగిరి,మేజర్ న్యూస్:** మనస్తాపంతో బావిలో దూకి గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. సేకరించిన వివరాల మేరకు మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం బసవతారకనగర్ కు చెందిన షేక్ మున్నీ వేరొక వ్యక్తిని వివాహం చేసుకుని కాపురం చేయడంతో పాటు ఇదేమిటని అడిగినందుకు తనపై మరొక ఇద్దరు వ్యక్తులతో కలసి దాడికి పాల్పడంతో మనస్తాపానికి గురైన కుమారుడు షేక్ అబ్బాస్ (24) గురువారం సాయంత్రం బావిలోకి దూకి గల్లంతైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం మంగళగిరి రూరల్ పోలీసులు, ఫైర్ సిబ్బంది బావిలో గాలింపు చర్యలు చేపట్టి బావి నీటిలో మునిగిన యువకుడు అబ్బాస్ మృతదేహాన్ని బయటకు వెలికితీసారు. అనంతరం పోస్ట్ మార్టం నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించిన రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నిమ్మగడ్డ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** సీపీఎం జిల్లా నాయకులు, మాజీ ఎమ్మెల్యే నిమ్మగడ్డ రామ్మోహనరావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సీపీఎం నాయకులు అన్నారు. మాజీ ఎమ్మెల్యే నిమ్మగడ్డ రామ్మోహనరావు 17వ వర్ధంతి సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిమ్మగడ్డ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్ మాట్లాడుతూ నిమ్మగడ్డ రామ్మోహన్రావు ధనిక కుటుంబంలో జన్మించినప్పటికీ పేద ప్రజల కోసం నిరంతరం పాటుపడిన మహనీయుడు అన్నారు. మంగళగిరి పట్టణ అభివృద్ధికి ప్రజాప్రతినిధిగా ఆయన చేసిన కృషి మరువలేనిది అని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు మాట్లాడుతూ నిమ్మగడ్డ ప్రజా ప్రతినిధిగా ఉంటూ ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం మంగళగిరిలో ఉన్న ప్రజాప్రతినిధిని కలవడానికి అపాయింట్మెంట్ దొరకని పరిస్థితి ఉందని అన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ ప్రభుత్వం రాజ్యమేలుతుందని అన్నారు. రైతాంగానికి అనేక నష్టాలు కలిగించే భూ సమీకరణ విధానాలను అవలంబిస్తున్నారని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలపై అనేక భారాలు వేస్తుందని అన్నారు. సిపిఎం జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ ప్రజా ప్రతినిధిగా ఈ నియోజకవర్గంలో పనిచేసే అన్ని గ్రామాల్లోనూ పాఠశాలను నిర్మించడం జరిగిందని అన్నారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం రవి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నిమ్మగడ్డ రామ్మోహన్రావు ప్రజాప్రతినిధిగా పనిచేసినప్పుడు అన్ని గ్రామాలకు డొంక రోడ్లను, తాగునీటి సౌకర్యాన్ని కల్పించడం జరిగిందని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకృష్ణ మాట్లాడుతూ పేద ప్రజల కోసం నిరంతరం పనిచేసిన నిమ్మగడ్డ రామ్మోహన్ రావు ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు. తొలుత సిపిఎం జెండాను సిపిఎం జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య ఆవిష్కరించారు. నిమ్మగడ్డ రామ్మోహన్రావు విగ్రహానికి సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి బాలకృష్ణ పూలమాలవేసి నివాళు లర్పించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై కమలాకర్, ఎం బాలాజీ, సిపిఎం పట్టణ నాయకులు ఎం చలపతిరావు, టి శ్రీరాములు, ఎస్ గణేష్, ఎం చంద్రారావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు టి శ్రీనివాసరావు, షేక్ జానీ బాషా, ఎస్ కోటేశ్వరరావు, ఎం రాంబాబు, కే బుజ్జి బాబు, జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గేయాలను ఆలపించారు.

## జూదాలపై ఉక్కు పాదం

**బొల్లాపల్లి మేజర్ న్యూస్:** వినుకొండ నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలం గరికపాడు గ్రామ శివారులో ఫారెస్ట్ లో కోతముక్క ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను బండ్లమోటు పోలీస్ స్టేషన్ ఎస్సై షమీర్ భాష సిబ్బందితో కలిసి పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద పందెంగా ఉపయోగిస్తున్న రూ.15,300/- నగదును సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేసాం అని అన్నారు.

# అర్హులైన పేదలందరికీ త్వరలోనే ఇళ్ల స్థలాలు

## - ఆర్డీవో మధులత



**యడ్లపాడు,మేజర్ న్యూస్:** అర్హులైన పేదలందరికీ ఇళ్ళ స్థలాలు త్వరలోనే ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నామని నరసరావుపేట ఆర్డిఓ మధులత చెప్పారు. శుక్రవారం మండలంలో పర్యటించిన ఆమె ముందుగా రెవిన్యూ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. అనంతరం జగ్గాపురం గ్రామానికి వెళ్లి గతంలో ఎస్సీ కాలనీ వాసుల కోసం ప్రభుత్వం భూసేకరణ చేసిన నివేశన స్థలాలను పరిశీలించారు. స్థలం వివరాలు, పంపిణీ చేసిన వారి జాబితాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు ఆమెను కలిసి సుదీర్ఘకాలంగా ఇళ్ళ స్థలాల కోసం నిరీక్షిస్తున్నామని వివిధ కారణాలతో ప్రభుత్వం వాటిని పంపిణీ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ భూసేకరణ కింద ప్రభుత్వం నగదు చెల్లించిన భూములను అర్హులైన వారిని గుర్తించి వేగవంతంగా పంపిణీ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అయితే గతంలో జాబితాను పరిశీలిస్తామని అదే విధముగా స్థలాలు లేని వారంతా తాజాగా ఆన్లైన్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఆయా పేర్లను అర్హతను గుర్తించి వీటిని పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.తదుపరి స్థానికంగా ఉన్న ప్రాథమిక పాఠశాల కొద్ది స్థలంలోనే నిర్మించారని దానిని పునరుద్ధరణ చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు ఆర్డీవో దృష్టికి తెచ్చారు. గ్రామంలో అంగన్వాడి శాశ్వత భవనం కూడా లేదని దాన్ని కూడా నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమెను కోరారు. ప్రజల నుండి తెలుసుకున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. జిల్లాలో నివేశన స్థలాల వివాదాలతో కోర్టులో పెండింగ్ ఉన్న వాటిని కూడా త్వరలోనే కౌంటర్ వేసి ఆయా పెండింగ్ సమస్యలను కూడా పరిష్కరించి పంపిణీ దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండలం పరిధిలో 12 గ్రామ సచివాలయాల ద్వారా 968 నివేసిన స్థలాలు కావాలని అర్జీలు అందాయని వాటిని పరిశీలించగా 204 అర్హులుగా గుర్తించమన్నారు. వీరందరికీ ఆయా గ్రామాల సమీపంలో ప్రభుత్వ భూములను గుర్తించి పంపిణీ చేసే దిశగా చర్యలు తీసుకుంటామని లేకుంటే ప్రైవేటు భూములను సేకరించే విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. టిడిపి నాయకులు ముద్దన నాగేశ్వరావు గ్రామంలోని సమస్యలను ఆర్డిఓ మధులత దృష్టికి తీసుకువచ్చారు. పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఆర్డిఓ వెంట యడ్లపాడు తహసిల్దార్ జె విజయ శ్రీ ,ఆర్ ఐ సుబ్బారావు, డిటి అనురాధ, మండల సర్వేయర్ సురేంద్రనాథ్, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

# రేట్ పేయర్స్‌తో పౌర సంస్థలు భాగస్వామ్యమవ్వాలి

## - ఓరుగంటి నారాయణరెడ్డి, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు




**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్:** ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ నగరంలో గల దాదాపు 20 పౌర సంస్థలను భాగస్వామ్యులను చేసి గుంటూరు అభివృద్ధికి కృషి చేస్తామని సంస్థ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీ గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో జరిగిన మీడియా సమావేశంలో జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, నేస్తం సహ వ్యవస్థాపకులు టి. ధనుంజయ రెడ్డి లతోపాటు రేట్ పేయర్స్ అసోసియేషన్ నేతలు కనపర్తి రాఘవరావు, వల్లూరి సదాశివరావు, రామాల అంజిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఓరుగంటి నారాయణరెడ్డి ప్రసంగిస్తూ ఈనెల 14వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు గుంటూరు బ్రాడీపేట 5వ లైను లోగల తాలూకా ప్రాంగణం నందు గల పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని, నగర అభివృద్ధిని కాంక్షించే ప్రజానీకం హాజరై తగు సూచనలు, సలహాలు అందించి గుంటూరు నగర అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ 1955 లో గుంటూరు ప్రధమ లోక్ సభ సభ్యులు ఎస్.వి. ఎల్. నరసింహం ఏర్పాటు చేసిన ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ గత 7 దశాబ్దాలుగా త్రాగునీటి, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి అవిరళ కృషి చేస్తుందన్నారు. నగర అభివృద్ధిలో పౌర సంస్థల భాగస్వామ్యాన్ని గుర్తించిన రేట్ పేయర్స్ అసోసియేషన్ గుంటూరు నగరంలోని పలు పౌర సంస్థల ప్రతినిధులను ఆహ్వానించి నగర అభివృద్ధిపై సదస్సును నిర్వహించ తలపెట్టడం అభినందనీయమన్నారు. నేస్తం సహ వ్యవస్థాపకులు టి. ధనుంజయ రెడ్డి ప్రసంగిస్తూ గుంటూరు నగర పరిధిలో 62 ఓవర్ హెడ్ ట్యాంకులు ఉండగా వాటిలో కేవలం సగమైనా రేట్ పేయర్స్ అసోసియేషన్ కృషి ఫలితంగా పరిశుభ్రంగా ఉంటున్నాయని, మిగిలిన ఓవర్ హెడ్ ట్యాంకులను యుద్ధ ప్రాతిపదికన శుభ్రం చేసి స్వచ్ఛమైన త్రాగునీటిని నగర ప్రజలకు అందజేయాలని కోరారు. రేట్ పేయర్స్ అసోసియేషన్ నేత కనపర్తి రాఘవరావు ప్రసంగిస్తూ నగరపాలక సంస్థ ప్రజలందరికీ స్వచ్ఛమైన త్రాగునీటిని అందించేలా చర్యలు చేపట్టాలని, తద్వారా డయేరియా, టైఫాయిడ్, హైపటైటిస్ లాంటి వ్యాధుల బారిన ప్రజలు పడకుండా కాపాడవచ్చని కోరారు.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి శిబిరం



**తెనాలి, మేజర్ న్యూస్:** రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంటపురం ఆంధ్ర పారిస్ రోటరీ చారిటబుల్ ట్రస్ట్, చావావారిపాలెం కు చెందిన ఎన్నారై నల్లమోతు మృత్యుంజయ ప్రసాద్ సుచేతల ఆర్థిక సహకారంతో ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ గూడవల్లి సౌజన్యంతో అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రోటరీ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు పాఠశాల ప్రిన్సిపాల్ అనురాధ రోటరీ సభ్యులు అంగలకుదురు గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, గణేష్ యూత్ అధ్యక్షులు, రోటరీ సభ్యులు వీరవల్లి మురళీకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో అమరావతి రీజియన్ సంయుక్త కార్యదర్శి గుత్తా వెంకటరత్నం రోటరీ సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జాస్తి నరేంద్ర రోటరీ కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ సభ్యులు అర్జున్ రావు ఐపిపి ఈదర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఉచిత నేత్ర వైద్య శిబిరంలో సీనియర్ ఇంటర్ జూనియర్ ఇంటర్ పదవ తరగతి 9వ తరగతి, 8వ తరగతి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలు ఉన్నవారికి ఉచితంగా కళ్ళజోళ్లను పంపిణీ చేయడానికి రోటరీ క్లబ్ సంసిద్ధత వ్యక్తం చేసింది. గోడవల్లి ఎల్వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ కు చెందిన బి నవీన్ రాజ్ చింతా బాపూజీ నాక్క రాంబాబు డి సరళ రావుల శైలజ రావుల శైలజ పాఠశాలకు చెందిన రామకృష్ణ జనార్ధన్ రావు పిడి రవిరాజు ప్రభృతులు పాల్గొనీ కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 400 మంది విద్యార్థిని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు.



# ఉజ్వల గ్యాస్ పథకాన్ని పేద ప్రజలకు చేరవేసిన భాజపా

**వినుకొండ మేజర్ న్యూస్:** పట్టణంలో అంబేద్కర్ కాలనీ నందు పేద ప్రజలను ఆదుకునేందుకు గ్యాస్ లేని మహిళలు కట్టెలతో వంట చేసుకున్నప్పుడు వారి కంట కన్నీరు పెట్టడం అనేక ఇబ్బందులు పడుతున్న మహిళల కోసం దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన ఉచిత గ్యాస్ ఉజ్వల పథకాన్ని వినుకొండ నియోజకవర్గంలో కూడా భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు సుమారు 350 మంది చేత అప్లికేషన్ పెట్టించిన జరిగింది . దానిలో భాగంగా ఈరోజు వినుకొండ పట్టణంలో అంబేద్కర్ కాలనీలో కూడా పెట్టిన 35 అప్లికేషన్స్ లో ఈరోజు కొంతమందికి ఉచిత గ్యాస్ కనెక్షన్ లు పల్నాడు జిల్లా బిజెపి మాజీ ప్రధాన కార్యదర్శి మేడం రమేష్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో బిజెపి కార్యకర్తలు పేద మహిళల కోసం ఉచిత గ్యాస్ కనెక్షన్లు కొరకు అర్జీలు పెట్టించడం జరిగిందని అన్నారు మహిళలు అందరూ ప్రధాని మోడీ కి పూర్తి మద్దతు ఇవ్వాలని రమేష్ అన్నారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బిజెపి తరఫున పోలా మరియమ్మ తెలుగుదేశం తరఫున లక్ష్మీపతి మరియు అధిక సంఖ్యలో మహిళలు హాజరయ్యారు.

# నేడు తుళ్ళూరులో నయీ చేతన 4.0 కార్యక్రమం

**గుంటూరు, జిల్లా పరిషత్ మేజర్ న్యూస్ :** నయీ చేతన 4.0 కార్యక్రమం (లింగ సమానత్వ ప్రచార కార్యక్రమం) శనివారం తుళ్ళూరులో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళలపై జరిగే హింస, వివక్ష, మహిళల ఆర్థిక సాధికారత మధ్య ఉన్న పరస్పర సంబంధాలపై కార్యక్రమంలో అవగాహన కల్పించడం జరుగుతోందని చెప్పారు. కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్, రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఇ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు. తుళ్ళూరులో మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని, సి.ఆర్.డి.ఎ స్కిల్ హబ్ వద్ద జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభోత్సవం చేస్తారని, స్థానిక పాఠశాల గ్రౌండ్‌లో లింగ సమానత్వ ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని డి.ఆర్.డి.ఏ - వెలుగు అధికారులు సమన్వయం చేయడం జరుగుతుందని చెప్పారు. అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని, నయీ చేతన 4.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# అన్నక్యాంటీన్లలో మౌలిక వసతులను ఏర్పాటు చేయాలి

## - నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** అన్నక్యాంటీన్లలో మౌలిక వసతులకు సంబంధించి ఏమైనా అవసరం ఉంటే జిఎంసి ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకొని చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అక్షయ పాత్ర సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆర్టీఓ కార్యాలయం రోడ్ లోని అన్న క్యాంటీన్ ని కమిషనర్ పరిశీలించి, ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అన్న క్యాంటీన్లలో ఆహారం తీసుకునేవారి సంఖ్య రోజురోజుకి పెరుగుతుందని, కొందరు క్యాంటీన్ లోపల స్థలం సరిపోక కాంపౌండ్ లోపల కూర్చొని భోజనం చేస్తున్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. లైటింగ్, ఫ్యాన్ల ఏర్పాటు, ఎక్కడైనా మరమత్తులు ఉంటే వెంటనే చేపట్టాలన్నారు. ఆహార సరఫరా అనంతరం ప్రాంగణం శుభ్రం చేయాలని అక్షయపాత్ర సిబ్బందిని ఆదేశించారు. ప్రతి రోజు ప్రభుత్వ నిర్దేశిత సమయంలో ఆహారం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.



## మెగా జాబ్ మేళా పోస్టర్ విడుదల చేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ




**వినుకొండ మేజర్ న్యూస్ :** ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న వినుకొండ లో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా పోస్టర్ ను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆవిష్కరించారు. జాబ్ మేళా అవకాశాన్ని వినుకొండ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్ మేళా ఇంటర్వ్యూలు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరుగుతాయని, 30 కి పైగా ప్రముఖ కంపెనీలు హాజరవుతున్నట్లు వివరించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు శరణాలయం వార్షికోత్సవం




**మంగళగిరి మేజర్ న్యూస్ :** మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి చినకాకానిలో షైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుపుతున్న షైన్ ఆనంద శరణాలయం ఏడో వార్షికోత్సవం ఈ నెల 14వ తేదీన జరుగుతుందని పౌండేషన్ చైర్మన్ డీజీ నాయక్, శరణాలయం నిర్వాహకురాలు శ్రీమతి సంధ్యారాణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం శరణాలయంలో వారు మాట్లాడారు. 19 సంవత్సరాల నుంచి శరణాలయం నడుపుకుంటూ వస్తున్నామని, అద్దె భవనం నుంచి చినకాకానిలో సొంత భవనంలోకి శరణాలయం వచ్చి ఈ ఏడాదికి ఏడు సంవత్సరాలు అవుతుందన్నారు. కొత్త భవనంలోకి మార్చిన తర్వాత నుంచి ప్రతి ఏడాది బాల బాలికలలో నూతన ఉత్తేజం పెంపొందించడానికి దాతల సహకారంతో వార్షికోత్సవం జరుపుతున్నామన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు వార్షికోత్సవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. దాతలు, శ్రేయోభిలాషులు, అతిథులు వార్షికోత్సవానికి హాజరై శరణాలయం బాల బాలికలచే నిర్వహించే వివిధ కార్యక్రమాలను తిలకించి, పిల్లలను ఆశీర్వదించి మా ఆతిథ్యాన్ని స్వీకరించాలని వారు కోరారు.

## గురజాల వాగ్దేవి కాలేజీ పక్కన గల అయ్యప్ప స్వా మీ షెడ్డు వద్దఅన్నదానం



**గురజాల మేజర్ న్యూస్ :** ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్ప, గురజాల్లోని వాగ్దేవి కాలేజీ పక్కన ఉన్న అయ్యప్ప స్వామి అన్నదాన షెడ్డు వద్ద చక్కగా స్వాములకు, మన ఎమ్మెల్యే సహకారం, గురజాల మండల ప్రజలు సహకారం తో స్వాములకు అన్నప్రసాద కార్యక్రమం 65వ రోజు, ఈ సద్ది కార్యక్రమం జనవరి ఒకటి వరకు జరుగును.

## రాష్ట్రస్థాయి క్రీడల్లో నిప్స్ విద్యార్థుల ప్రతిభ




**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** ఇటీవల నిర్మల ఫార్మసీ కళాశాల మంగళగిరి నందు నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలలో స్థానిక నిప్స్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు పాల్గొని వివిధ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్న మెంట్ లో ప్రథమ స్థానం, కారమ్స్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఎన్ సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు రాష్ట్రస్థాయి క్రీడలలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి నందుకు ఆనంద వ్యక్తం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు మరియు యాజమాన్యం అభినందించారు. కళాశాల స్పోర్ట్ కోఆర్డినేటర్ పి. ఆదినారాయణ రెడ్డి మరియు కళాశాల పి.డి కృష్ణారెడ్డి మరియు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## కల్లం శ్రీనివాసరెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ గోపిరెడ్డి



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట పట్టణంలోని 31వ వార్డు వైఎస్ఆర్ సీపీ నాయకులు కల్లం శ్రీనివాస్ రెడ్డి జన్మదిన సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ నిర్వహించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరసరావుపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమంలో మరియు 31వ వార్డు వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

## నాయకురాలు నాగమ్మ ప్రతిష్ఠించిన శివాలయంను దర్శించుకున్న జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా





**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామంలో 11వ శతాబ్దంలో ఆనాడు నాయకురాలు నాగమ్మ నిర్మించిన శివలయాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్ల సందర్శించారు. గామలపాడు గ్రామంలో ఆనాడు నిర్మిచిన శివాలయం శిథిలా వస్థకు చేరిన నేపథ్యంలో ఇటీవల కాలంలో టీటీడీ బోర్డ్ మెంబెర్ జంగా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పుణ నిర్మిస్తున్న శివలయాన్ని శుక్రవారం పల్నాడు జిల్లా కలెక్టర్ సందర్శించారు. ముందుగా ఆలయ అర్చ కులు,స్థానిక రెవిన్యూ అధికారు లు కలెక్టర్ కృత్తికా శుక్లా కి స్వాగతం పలికా రు.అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణం లో జరుగుతున్న నిర్మాణాల వివరాలను అక్కడ ఉన్న అధికారులను, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా కి వేద ఆచిర్వచనం అందజేసి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురజాల ఆర్డీవో మురళి,గ్రామ సచివాలయం సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డులో రూ.37.70 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**మంగళగిరి మేజర్ న్యూస్ :** మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మార్కెట్ యార్డ్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టనున్న రూ.37 లక్షల 70 వేల విలువైన అభివృద్ధి పనులకు మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ శంకుస్థాపన చేశారు.ప్రభుత్వం ఆమోదించిన ఈ నిధులతో మార్కెట్ యార్డులో అత్యవసర మరమ్మతులు, రైతు సదుపాయాల మెరుగుదలకు సంబంధించిన పలు పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ మాట్లాడుతూ... చంద్రబాబు రైతుల సంక్షేమం పట్ల ప్రభుత్వం చూపుతున్న కట్టుబాటు ప్రశంసనీయమని అన్నారు. మార్కెట్ యార్డులో భవనాలు దెబ్బతినడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి, మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ ప్రత్యేకంగా స్పందించి ఈ నిధులను మంజూరు చేయడం రైతు సంక్షేమానికి నిదర్శనమని పేర్కొన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం – రైతుల ప్రభుత్వంగా వ్యవహరిస్తోందని అన్నారు.మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్ నాయకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా సాగుతున్నాయని వివరించారు. ఆ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా మార్కెట్ యార్డులో రూ.37.70 లక్షల విలువైన పనులు ప్రారంభించడం రైతులకు నేరుగా ఉపయోగకరమవుతుందని చెప్పారు. మార్కెట్ యార్డు పరిసరాల అభివృద్ధి, సౌకర్యాల విస్తరణ, భవనాల మరమ్మతులు వంటి పనులతో రైతులకు మెరుగైన వాతావరణం అందించగలమని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మరిన్ని సరికొత్త సదుపాయాలు, ఆధునికీకరణ రైతులు, వ్యాపారుల అవసరాలకు అనుగుణంగా మార్కెట్‌ను ఆధునికీకరించేందుకు అన్ని విధాల కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. మంగళగిరి సొసైటీ అధ్యక్షులు గాదె పిచ్చిరెడ్డి మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో మంగళగిరి మార్కెట్ అభివృద్ధి చేసిన సంగతిని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తాజాగా టిడిపి ప్రభుత్వ హయాంలోనే అదే జోష్‌తో మార్కెట్ యార్డ్ అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్తున్నామని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా మార్కెట్ యార్డ్‌కు మరిన్ని మౌలిక వసతులు, ముఖ్యంగా లింకు రోడ్ల అభివృద్ధి, సదుపాయాల విస్తరణ వంటి పనులు చందు నాయకత్వంలో కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ యర్రగుంట్ల భాగ్యారావు, పాలకవర్గ సభ్యులు బైరబోయిన పద్మావతి, మేడిశెట్టి కిషోర్, ఎన్ విజయ కుమార్ రెడ్డి, వల్లభాపురం స్వర్ణకుమారి, ఉయ్యాల శ్రీనివాసరావు, షేక్ తస్లీమ్, నైనాల లావణ్య, జగ్గారపు నాగకుమారి, మన్యం మల్లేశ్వరి, నక్క రాజేశ్వరి, నల్గొండ పరమేశ్వరరావు, బైరబోయిన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య, ఇంజినీరింగ్ వాహనాలన్నింటికీ జిపిఎస్ ట్రాకర్ వారం రోజుల్లో ఏర్పాటు చేయాలి కమిషనర్ ఆదేశాలు



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన పారిశుధ్య, ఇంజినీరింగ్ వాహనాలన్నింటికీ జిపిఎస్ ట్రాకర్ ని వారం రోజుల్లో ఏర్పాటు చేయాలని, ట్రాకర్ ని త్వరలో ఏర్పాటు చేయనున్న కమాండ్ కంట్రోల్ రూమ్ కి అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెద్ద పలకలూరు, ఉద్యోగ నగర్, విజయపురి కాలనీ, సమ్మర్ పేట, ఇన్నర్ రింగ్ రోడ్ శ్రీరామ్ నగర్, ద్వారకా నగర్, అరండల్ పేట ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్డ్ ల వారీగా చెత్త తరలింపు, ఎస్ఎస్ లకు చెట్ల కొమ్మలు, ఇతర వ్యర్థాలు తొలగింపు, పైప్ లేని ప్రాంతాలకు త్రాగునీటి సరఫరా చేయడానికి ఉన్న వాహనాలన్నింటికీ జిపిఎస్ ట్రాకర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాకర్లను త్వరలో ఏర్పాటు చేసే కమాండ్ కంట్రోల్ రూమ్ కి అనుసంధానం చేసి, ఏ వాహనం ఎన్ని ట్రిప్పు లు వెళ్ళింది, ఏ ప్రాంతాలకు వెళ్లింది తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ అధికారులు నూతన రోడ్లను ఎండ్ టు ఎండ్ ఉండేలా ప్రతిపాదనలు చేయాలని, డ్రైన్ నిర్మాణం చేయకుండా రోడ్ నిర్మాణం చేయవద్దన్నారు. వార్డ్ సచివాలయాల వారీగా ప్లానింగ్ కార్యదర్శులు అనధికార, అక్రమ నిర్మాణాలు జరగకుండా పటిష్టంగా చర్యలు తీసుకోవాలన్నారు. అరండల్ పేటలో జిఎంసి నుండి తీసుకున్న ప్లాన్ కి భిన్నంగా జరుగుతున్న భవన నిర్మాణ పనులు నిలిపివేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పురమిత్ర, మన మిత్ర, స్వచ్ఛత యాప్, వాట్సప్ గవర్నెన్స్ పై ప్రజలకు అవగాహన కల్గించాలని, ప్రతి సచివాలయం పరిధిలో ఆయా యాప్ లను ప్రజలు డౌన్లోడ్ చేసుకునేలా కార్యదర్శులు చొరవ చూపాలన్నారు. పర్యటనలో సిటి ప్లానర్ రాంబాబు, ఏసిపి రెహ్మాన్, డిఈఈలు సతీష్ కుమార్, రమేష్ బాబు, ఎస్ఎస్ ఐజాక్, ప్రసాద్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మేరీ కుర్జ్ మెమోరియల్ సెంటెనరీ టౌన్ బాప్టిస్ట్ చర్చ్ ని ప్రారంభించిన చదలవాడ



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట పట్టణంలోని స్టేషన్ రోడ్డులో నూతనంగా నిర్మించిన మేరీ కుర్జ్ మెమోరి యల్ సెంటెనరీ టౌన్ బాప్టిస్ట్ చర్చ్ ని దేవునికి అంకితం ఇచ్చే కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని చర్చిని దేవునికి అంకితం చేశారు. ఆయన చేతుల మీదుగా చర్చి ప్రారంభోత్స వం జరగడం పట్ల పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రార్థనా మందిరం కేవలం ఇటుకలు, సిమెంటు తో చేసిన భవనం మాత్రమే కాదు, అది ప్రజలు దేవునిని కలుసుకోవడానికి, ఆరాధించడానికి ఉద్దేశించిన పవిత్రమైన స్థలం అని అన్నారు. ఈ కార్యక్ర మంలో పాస్టర్లు, ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాస్టర్లకు బహుమతులు బహుకరించారు.

# నేషనల్ ఇమ్యు సైజేషన్ డే ను విజయవంతంగా పూర్తి చేయాలి

## పోస్టర్ను ఆవిష్కరించిన జిల్లా రెవెన్యూ అధికారి ఏక.మురళి

**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం నరసరావుపేట లోని కలెక్టర్ కార్యాలయం లో జిల్లా రెవెన్యూ అధికారి చాంబర్లో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఏక. మురళి అధ్యక్షతన వహించారు. ఈ కార్యక్రమంలో పలనాడు జిల్లా డి ఎం హెచ్ ఓ బి. రవి జిల్లా ఇమ్యు సైజేషన్ అధికారి డాక్టర్ వై. రాంబాబు ఐ సి డి ఎస్, విద్యాశాఖ, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖ ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈనెల 21 డిసెంబర్ 2025 ఆదివారం నిర్వహించనున్న నేషనల్ ఇమ్యు సైజేషన్ డే (ఎన్ఐడి) ను విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన అన్ని ఏర్పాట్లు పై సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలియో బూతుల ఏర్పాటు మైక్రోఫోన్లో సిద్ధం, ట్రాన్స్, మొబైల్ టీమ్ల ఏర్పాట్లు వ్యాక్సిన్ కోళ్ల చేసి నిర్వహణ మానవ వనరుల వినియోగం వంటి అంశాలను అధికారులు సమగ్రం గా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లాలోని జీరో నుండి ఐదు సంవత్సరాల వయస్సు గల



పిల్లలందరికీ తప్పనిస రిగా (బి ఓ పి వి) పోలియో చుక్కలు అందించాలని, ఒక్క చిన్నారిని కూడా మిస్ కాకుండా హైరిస్క్ ఏరియా ప్లాన్ లను కచ్చితంగా అమలు చేయాలని, డిఆర్ఓ అధికారు లను ఆదేశించారు. ప్రతి వలస కుటుంబాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రదేశాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్, వంటి ప్రాంతాలలో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని, అక్కడ పిల్లలు మిస్ కాకుండా అదనపు టీమ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నేషనల్ ఇమ్యు సైజెషన్ డే (ఎన్ఐడి) పోస్టర్ను ఆవిష్కరించారు. విభాగాదికారులు పోలియో నిర్మూలన లక్ష్యాన్ని సాధించేందుకు సమన్వ యంతో పనిచేయాలని తెలియజేశారు.

# విద్యుత్ అదాలత్ లతో సమస్యల పరిష్కారం -సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల



**మంగళగిరి, మేజర్ న్యూస్:**విద్యుత్ అదాలత్‌ల ద్వారా వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తామని మాజీ న్యాయమూర్తి, సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్ అన్నారు. మంగళగిరి లోని సీఎన్ఆర్ కళ్యాణ మండపంలో శుక్రవారం విద్యుత్ అదాలత్ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఇమ్మానియేల్ మాట్లాడుతూ విద్యుత్ అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. అధికారుల ప్రవర్తనపై, అవినీతి పై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వినియోగదారులతో మర్యాదగా మెలగాలన్నారు. వినియోగదారులు కూడా అధికారులపై నిరాధారమైన ఆరోపణలు చేయరాదన్నారు. నిరాధార ఆరోపణలు అని తేలితే ఫిర్యాదుదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల సమమయంలో తనిఖీ అధికారులు ఇష్టానుసారం కేసులు రాయకుండా నిబంధనల మేరకే వ్యవహరించాలన్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతోనే విద్యుత్ అదాలత్‌నిర్వహిస్తున్నామన్నారు. విజయవాడ లోని సీజీఆర్ఎఫ్ కార్యాలయంలో కూడా నేరుగా అర్జీలు అందజేయవచ్చన్నారు. విద్యుత్ అదాలత్‌లో మొత్తం 22 ఫిర్యాదులు రాగా, అందులో 16 ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించడం జరిగిందని తెలిపారు. మిగిలిన ఆరు ఫిర్యాదులకు సంబంధించి త్వరితగతిన పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక సభ్యులు కృష్ణ నాయక్, అకౌంట్స్ సభ్యులు శ్రీకృష్ణ, సీఆర్డిఏ సూపరిండెంట్ ఇంజనీర్ ఎం శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జే సంజీవరావు లతో పాటు పలువురు విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

# పల్లె ప్రగతికి కూటమి ప్రభుత్వం బాటలు



**మాచర్ల మేజర్ న్యూస్:** మాచర్ల నియోజకవర్గ పల్లె ప్రగతికి కూటమి ప్రభుత్వం పటిష్ట బాటలు వేస్తుందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శు క్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రధాన రహదారులకు కలిపే అప్రోచ్ రహదారుల నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ. 11 కోట్లు నిధులు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నిధుల ద్వారా వెల్దుర్తి మండలంలో ఎర్రబాలెం నుంచి మండాది వరకు 5.954 కి. మీ మేర రోడ్డుకు రూ. 2.79 కోట్లు, మాచర్ల మండల పరిధిలో ముత్యాలంపాడు నుంచి మంచికల్లు వరకు 0.413 కీ. మీ మేర రోడ్డుకు రూ. 0.23 లక్షలు, దుర్గి మండలంలో మాచర్ల కారంపూడి రోడ్డు నుంచి నిదానంపాడు వయా రాజానగరం వరకు 3.782 కీ.మీ మేర రోడ్డుకు రూ. 2.02 కోట్లు, దుర్గి -వినుకొండ అడ్డరోడ్డు నుంచి మించాలపాడు పోవు 3.439 కీ.మీ మేర రోడ్డుకు రూ. 2.36 కోట్లు, కారంపూడి మండలంలో మాచర్ల - నరసరావుపేట రోడ్డు నుంచి చినగార్లపాడు వయా చింతపల్లి వరకు 8.487 కీ.మీ మేర రోడ్డు రూ. 3.46 కోట్లు నిధులు కేటాయింపులు జరిపి, నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. అలానే నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# నేడు బుర్రిపాలెం ఫీడర్ పరిధిలో విద్యుత్ నఅంతరాయం ఉండవచ్చు

**తెనాలి, మేజర్ న్యూస్ :** తెనాలి పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిచిపోయే అవకాశం ఉందని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బోరుగడ్డ అశోక్ కుమార్ తెలిపారు. బుర్రిపాలెం రోడ్డులోని సబ్ స్టేషన్ లో మరమత్తుల కారణంగా గురవయ్య కాలనీ, రామలింగేశ్వరపేట, నాజరుపేట, గాంధీనగర్, బుర్రిపాలెం రోడ్డు, నందులపేట, గాంధీచౌక్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిచిపోయే అవకాశం ఉందన్నారు. వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు ఆయన స్పష్టం చేసారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

# అనారోగ్య బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**తెనాలి, మేజర్ న్యూస్ :** అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుక్రవారం అందజేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కంచర్లపాలెం గ్రామానికి చెందిన నాగలక్ష్మికి రూ. 1.50 లక్షలు, పట్టణానికి చెందిన పఠాన్ రమీజాబికి రూ. 1.20 లక్షల ఆర్థిక సాయం చెక్కులను ఎమ్మెల్సీ ఆలపాటి అందించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# కాసు మాటలు దెయ్యాలు వేదాంతాలు చదివినట్లు వుంది: టీడీపీ నాయకులు



పిడుగురాళ్ల మేజర్ న్యూస్ డిసెంబర్ 12 : గురజాల నియోజకవర్గం పిడుగురాళ్ల పట్టణం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఎన్డీఏ కూటమి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ,నియోజకవర్గ కమిటీ,మండల కమిటీ బీసీ నాయకులు మాట్లాడుతూ.. గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు సహకారంతో మాచవరం మండల ఎంపీపీగా ఎన్నికైన కొక్కెర అంజమ్మ వీరాస్వామి కీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు చట్టసభల్లో స్థానం కల్పించడం. అనేక ఉన్నతమైన పదవులు ఇస్తూ వాళ్ళని గౌరవించడం జరుగుతుందనీ, అది చూసి ఓర్వలేక గురజాల మాజీ శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి దెయ్యాలు వేదాంతాలు చదివినట్లు బీసీలకు ఏదో అన్యాయం జరుగుతుందని అనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇదే కాసు మహేష్ రెడ్డి 2020లో పిడుగురాళ్ల పట్టణంలో 33 వార్డులకు ఎలక్షన్ జరక్కుండా చేయడమే కాకుండా ఎలక్షన్ లో పోటీ చేయడానికి వచ్చిన అభ్యర్థులను అక్రమ కేసులు బనాయిస్తానని బెదిరించి 33 వార్డులు ఏకంగ్రీ చేసుకున్న సంగతి మర్చిపోయారా కాసు మహేష్ రెడ్డి అని ప్రశ్నించారు. 2019 నుంచి 2024 వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అనేక మంది బీసీలపై దాడి చేయడమే కాకుండా హత్యలు చేసి బీసీ ఆడబిడ్డల తాళిబొట్టులతో ఆటలాడుకున్నారని దుయ్యబట్టారు. ఈరోజు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ బద్ధంగా అధికారులు ఎలక్షన్ నిర్వహించి అక్కడ తెలుగుదేశం పార్టీకి ఎన్డీఏ కూటమికి మద్దతు తెలపడం వల్ల ఎంపీపీగా అంజమ్మ వీరాస్వామి ని ఎన్నుకోవడం జరిగిందని దాన్ని కూడా ఏదో బెదిరించారు. ఇబ్బందులు పెట్టారని కాసు మహేష్ రెడ్డి అనడం దారుణం అన్నారు. అక్రమ కేసులు బనాయిస్తానని చెప్పడం,గంజాయి కేసులు పెడతానని బెదిరించడం మీ వైసీపీ ప్రభుత్వానికి కాసు మహేష్ రెడ్డికి చెల్లుతుందని, యరపతినేని శ్రీనివాసరావు నీతి నిజాయితీ గల నాయకుడని ఆయనకు అలాంటి సంస్కృతి లేదని తెలిపారు. మీలాగా రాజకీయాల్లో ఓడిపోతే రాజకీయం సన్యాసం చేస్తానని చెప్పి మాట తప్పిన నువ్వు రాజకీయాల గురించి ఎలక్షన్ల గురించి మాట్లాడే అర్హత లేదని తెలిపారు. తదనంతరం గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు కి కృతజ్ఞతలు తెలిపి ఎంపీపీ గా ఎన్నికైన అంజమ్మ వీరాస్వామి లను ఘనంగా సన్మానించి అభినందించటం జరిగినది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర,జిల్లా,నియోజకవర్గం,అన్ని మండల ముఖ్య నాయకులు,అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ నాయకులు చుక్కపల్లి చినబాబు మృతి



**తెనాలి, మేజర్ న్యూస్ :**టీడీపీ సీనియర్ నాయకులు చుక్కపల్లి సురేష్(చినబాబు) మృతి చెందారు. తెనాలిలోని గంగానమ్మపేటలో ఆయన నివాసంలో భౌతికకా యాన్ని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పలువురు టీడీపీ నాయకులు, ప్రర ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

# జడ్పీహెచ్ఎస్ బాలికోన్నత పాఠశాలకు 35 రకాల పూల మొక్కలు వితరణ



**దుగ్గిరాల , మేజర్ న్యూస్ :** దుగ్గిరాల గ్రామంలోని బాలికోన్నత పాఠశాలలో ఆంగ్లాన్ని బోధించే ఉపాధ్యాయురాలు పెరవలి సంధ్యారాణి పాఠశాలకు విద్యార్థు నులకు 35 రకాల పూల మొక్కలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు. ఎస్ శోభా దేవి కి అందజేశారు .పూల మొక్కలతో పాటు. విద్యార్థు నులు బాగా కష్టపడి గోల్ సాధించే విద్య కుసుమాలు గా పరిమళించాలని, వివిధ రకాల పూల మొక్కలను పాఠశాలకు బహు కరించటం విశేషం . విద్యార్థు నుల , బాలుకోన్నత పాఠశాల పైన ఉన్న బహుదూరపు మనసుతో పాఠశాలకు అందించిన మొక్కలు, వికసించాలని కోరుకోవడం ,పాఠశాల పైన అంతర్లీనంగా దాగివున్న మది అర్థమవుతుంద 0టున్నారు . ఉపాధ్యాయిని. సంధ్యారాణి మనసుకు దీటుగా విద్యార్థు నులు విద్యా కుసుమాలుగా వికసించి పాఠశాలకు, గురువులకు ,తల్లిదండ్రులకు , రకరకాల పూల బొకేలను. అందించే ఎత్తుకు వెళ్లాలని కోరుకోవాల్సిందే.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డాక్టర్ అనిల్ కుమార్



**దుగ్గిరాల ,మేజర్ న్యూస్ :** దుగ్గిరాల గ్రామంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్ను రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ అదనపు సంచాలకు లుడాక్టర్ అనిల్ కుమార్ ఆకస్మిక తనకి చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న పునరుత్పత్తి శిశు ఆరోగ్యం తదితర కార్యక్రమాలఅమలు తీరు, రికార్డులను తనకి చేశారు .ప్రైమరీ హెల్త్ సెంటర్లో జరుగుతున్న సేవలను రికార్డులను. తనిఖీ చేశారు. డాక్టర్ ఇందిరను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగుల రికార్డుల నమోదు చేసే విషయంలో తగు. సూచనలు చేశారు. ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్, మందులు గదిని పరిశీలించారు. రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమా లు అమలు పరిస్థితిని ఆన్లైన్లో వివరంగా పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన అధికారి డాక్టర్ సతీష్ , సమాజ ఆరోగ్య అధికారి బి సునీత ,డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి వంకదార సుబ్బారావు, ఫార్మసిస్ట్ విజయ ,ఆరోగ్య కార్యకర్తలు ,ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# 11 గ్రామాల విలీనం ప్రక్రియ పై భిన్నాభిప్రాయాలు

- భౌగోళికంగా దగ్గర ఉన్న గ్రామాలను కలుపుకోవాలన్న కార్పొరేటర్లు
- 11 గ్రామాల విలీనానికి వైసిపి వ్యతిరేకిస్తుందన్న డిప్యూటీ మేయర్ బాల వజ్రబాబు
- కార్పొరేటర్ల అభిప్రాయాలను కలెక్టర్ కు తెలియజేస్తాం
- కమిషనర్ శ్రీనివాసులు, మేయర్ కోవెలమూడి రవీంద్ర వెల్లడి



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. శుక్రవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర పాలక సంస్థలో విలీనం చేయదలచిన 11 గ్రామాలు, ప్రగతి నగర్, యానాది కాలనీలలో ఆక్రమణల క్రమబద్ధీకరణకు నిరభ్యంతరం (యన్.ఓ.సి) ల పై ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, యం.యల్.సి చంద్రగిరి ఏసురత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనులు వేగవంతంగా జరుతున్నాయని, ఆ ప్రక్రియలో భాగంగా ప్రత్తిపాడు నియోజకవర్గ శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు గుంటూరు నగరానికి దగ్గరగా ఉన్న తన నియోజకవర్గంలోని 11 (చల్లావారి పాలెం, చినపలకలూరు,దాసుపాలెం, గోర్లవారి పాలెం, జొన్నలగడ్డ, లాలుపురం, మల్లవరం, ఓబులు నాయుడు పాలెం, తోకవారిపాలెం, తురకపాలెం, వెంగలాయపాలెం) గ్రామాలు త్వరితగతిన అభివృద్ధి చెందుటకు నగర పాలక సంస్థలో తీర్మానం చేసి, విలీనం చేయాలని కోరారన్నారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన అత్యవసర సమావేశంలో కార్పొరేటర్లు అభిప్రాయాలను నివేదిక రూపంలో జిల్లా కల్లెక్టర్ వారికి పంపుతామని తెలిపారు. ప్రగతి నగర్, యానాది కాలనీలలో ఆక్రమణల క్రమబద్ధీకరణకు నిరభ్యంతరం (యన్.ఓ.సి) లకు ఆమోదం తెలిపడం జరిగిందన్నారు.

### వెంకట కృష్ణమాచారి 32 డివిజన్ కార్పొరేటర్..

గుంటూరు నగరపాలక సంస్థ అభివృద్ధి చెందడం అందరికి ఇష్టమే. అలాగే నగరంలో 11 గ్రామాలు కలుపుకోవడమూ ఇష్టమే.. కానీ దగ్గరగా ఉన్న గ్రామాలను కలుపుకోవాలి, ముందస్తుగా గుంటూరు నగరాన్ని అభివృద్ధి చేయాలి ఆ తరువాతే మిగిలిన గ్రామాల గురించి ఆలోచించాలి.

### డిప్యూటీ మేయర్ బాల వజ్రా బాబు..



గుంటూరు నగరపాలక సంస్థలో 11 గ్రామాలను కలుపుకునే ముందు శాస్త్రీయ పద్ధతిలో ఆలోచనలు చేయాలి. కలుపుకోవడం వలన వచ్చే ఇబ్బందులు, జరిగే అభివృద్ధి, ప్రస్తుతం గుంటూరు నగరంలోని శివారు గ్రామాల పరిస్థితులు, అక్కడ జరిగిన అభివృద్ధి పనులు, ప్రజలు ఇబ్బందులను 11 గ్రామాల ప్రజలకు వివరంగా చెప్పాలి. గ్రామసభలు నిర్వహించాలి. అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలి.బడ్జెట్ వివరాలు, అభివృద్ధి, ఇతర వివరాలు ప్రజలకు, కార్పొరేటర్ లకు వివరించారా అని ప్రశ్నించారు. కొత్తగా కలిసే గ్రామాల ద్వారా 35000 జనాభా నగరంలో కలుస్తారని, అదనంగా 20 వేల ఎకరాల ల్యాండ్ నగరానికి ఏర్పడుతుందని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే రామాంజనేయులు చెప్పారు. వారి మాటల్లోని నిజాన్నిసాలను ప్రజలకు వివరించాలి. అధికార పార్టీ తీసుకునే అనాలోచితంఅధికార పార్టీ తీసుకునే అనాలోచిత నిర్ణయాలను వైసీపీ పార్టీ తరఫున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.ఏక పక్షంగా తీర్మానం చేయడం కరెక్ట్ కాదు. గుంటూరు నగరపాలక సంస్థకు విలీన గ్రామాల తో నష్టం కలుగుతుంది అని డిప్యూటీ మీద వనమా బాల వజ్ర బాబు పేర్కొన్నారు.

### అభివృద్ధి పనులపై దృష్టి సారించండి..
### - 30 డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి



గుంటూరు నగరంలో అభివృద్ధి పనులపై దృష్టి సారించకుండా కొత్త గ్రామాల విలీనానికి చర్చలు మొదలెట్టడం సరైన చర్య కాదని 30 డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి అన్నారు. గతంలో విలీనం చేసిన గ్రామాలలో ఇప్పటికీ సరైన రీతిలో అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పించలేకపోయామని స్పష్టం చేశారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి, ఆర్థిక, భౌగోళిక, వాస్తు పరిస్థితులు ప్రజల అభిప్రాయాలు రాజకీయ పార్టీల అభిప్రాయాలతో ముందుకు సాగాలని, 11 గ్రాముల విలీన ప్రకటనకు తాము వ్యతిరేకిస్తున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున వారు అమావాస్య స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్లు వనమా బాల వజ్ర బాబు, షేక్ సజీల, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, సెక్రటరీ బి. శ్రీనివాసరావు, డిప్యూటి కమిషనర్లు సి.హెచ్ శ్రీనివాస్, టి. వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, యస్.ఈ (ఇంచార్జ్) సుందరరామి రెడ్డి, యం.హెచ్.ఓ డాక్టర్ లక్ష్మీ నారాయణ, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



### విలీన గ్రామాలతో నగరం మరింతగా అభివృద్ధి చెందుతుంది



విలీన గ్రామాలతో నగరం మరింతగా అభివృద్ధి చెందుతుందని, 11 గ్రామాలను కలుపుకోవాల్సిందేనని 35వ డివిజన్ కార్పొరేటర్ ఈ వరప్రసాద్ సమావేశంలో పేర్కొన్నారు. నగరం అభివృద్ధి చెందితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని విశ్లేషించారు. గడిచిన 7 నెలల్లో సుమారు 1300 కోట్లకు పైగా నిరుదలతో అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. భౌగోలికంగా దూరంగా ఉన్న గ్రామాలను పక్కన పెట్టి, దగ్గరగా ఉన్న గ్రామాలను కలుపుకుంటే మంచిదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

**- 35వ డివిజన్ కార్పొరేటర్ ఈ వరప్రసాద్**

### ముందుగా నగర సమస్యలు పరిష్కరించండి..

గుంటూరు నగరంలో విలీన గ్రామాల సంగతి పక్కనపెట్టి ముందస్తుగా గుంటూరు నగరపౌరులకు మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని 55వ డివిజన్ కార్పొరేటర్ అంబేద్కర్ మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. శంకర్ దాస్ పెట్టి నిర్మాణంలో తీవ్రమైన నిర్లక్ష్యం ఉందని ఆరోపించారు. శంకర్ దాస్ బ్రిడ్జి నిర్మాణానికి కోర్టు వివాదాలకు సంబంధించిన అడ్డంకులు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించి ముందుగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు.

**- 55వ డివిజన్ కార్పొరేటర్ అంబేద్కర్**

## చెంచుపేటలో వాహన తనిఖీలు

**తెనాలి మేజర్ న్యూస్ :** పట్టణంలోని చెంచుపేట ఉమేష్ చంద్ర విగ్రహ సెంటర్ వద్ద త్రీ టౌన్ సీఐ సాంబశివరావు ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. సీఐ సాంబశివరావు ఎన్ సీసీ, స్కాట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ట్రాఫిక్, వాహన నిబంధనలపై అవగాహన కల్పించారు. విద్యార్థులచే వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో త్రిబుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, అతి వేగంగా ప్రయాణించడం, తనిఖీలను గమనించి పారిపోతున్న వారిని పట్టుకున్నారు. నింబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ సాంబశివరావు తెలిపారు. ఎన్ సీసీ, స్కాట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు పోలిసింగ్ విధానంపై అవగాహన కల్పించే కార్యక్రమం కొనసాగిస్తామని ఆయన చెప్పారు. ఎస్ఐ ప్రకాశరావు, సిబ్బంది ఉన్నారు.



# స్థలం ఒక సర్వే నెంబర్.. రిజిస్ట్రేషన్ మరో సర్వే నెంబర్




మొదటి పేజీ తరువాయి

అక్రమ రిజిస్ట్రేషన్లకు లక్షల్లో ముడుపులు ఇవ్వాల్సిందేనని కార్యాలయ సిబ్బంది, స్టాంపు రైటర్లు సబ్ రిజిస్ట్రార్ పేరుతో డిమాండ్ చేస్తున్నారని స్థానికంగా చెప్పుకుంటున్నారు. గుంటూరు జిల్లా రాజధాని ప్రాంతం కావడంతో చుట్టు ప్రక్కల గ్రామాల్లో భూములకు విపరీతమైన డిమాండ్ వచ్చింది. ఎకరా భూమి ధర రూ 10 కోట్లు దాటింది అంటే ఆశ్చర్యం అక్కరలేదు. పేదల భూములను రెవిన్యూ అధికారులు గుట్టు చప్పుడు కాకుండా లాలూచీ పడి ప్రభుత్వ భూములు, ఎసైన్డ్ భూములు, ఇనాం భూములకు నకిలీ సర్వేనెంబర్లుతో నూ, పక్కన ఉన్న సర్వే నెంబర్లతోను పట్టా భూములుగా మార్చి ఎంచక్కా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు పారిశ్రామికవేత్తలకు, ధనవంతులకు, రాజకీయ పలుకు బడి కలిగిన వారికి రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. తలా పాపం, తిలా పిడికెడు అన్నచందంగా అక్రమరిజి స్ట్రేషన్లలో నగదును సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది. అధికారులు ఆరోజు సాయంత్రానికే ఎవరి వాటాలు వారి ఇళ్ళ దగ్గరికి వెళ్లే ఏర్పాటు చేసుకున్నారు.

### ఒక్కొక్క రిజిస్ట్రేషన్ కు ఒక్కొక్క ధర...

ఒక్కొక్క రిజిస్ట్రేషన్ కు ఒక్కొక్క ధర ఎంత నిర్ణయించి ముందుగానే మాట్లాడుకుని ఆ తర్వాతనే రిజిస్ట్రేషన్ కు ముందుకు వెళ్లే పరిస్థితి మంగళగిరి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఉంది. అవినీతికి, అక్రమాలకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అడ్డగా మారింది. తెనాలి, నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మాచర్ల, కోరిటపాడు, వినుకొండ రిజిస్ట్రేషన్ అధికారుల అక్రమాల కంటే జిల్లాలోని రాజధాని ప్రాంతంలో ఉన్న మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ గా నాపేరే ముందుండాలన్నట్లుగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేసేస్తూ దోచేసుకుని, దాచేసుకుంటున్నారనే తెలుస్తోంది.

### ఏసీబీ దాడులు తమపై జరగవంటున్న కార్యాలయం ఉద్యోగులు.

ఎసీబీ అధికారు దాడులతో గుంటూరు, పల్నాడు జిల్లాలలోని సబ్ రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్లు చేయాలన్నా, నకిలీ రిజిస్ట్రేషన్ల కాగితాలపై సంతకాలు పెట్టాలన్నా ఒకటికి నాలుగుసార్లు ఆలోచిస్తున్నారు. నరసరావుపేట రిజిస్ట్రార్ కార్యాలయంపై ఆధారాలతో ఫిర్యాదులు అందితేనే చర్యలు తీసుకోని అధికారులు పట్టు బడితే నన్నేం చేస్తారులే అన్నట్లుగా ధీమాతో రిజిస్ట్రార్ ఉన్నట్లు తెలుస్తోంది. మంగళగిరి రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో ఇనాం భూ ములు, ప్రభుత్వ భూములు, దేవాదాయ శాఖ భూములు, చెరువు పోరంబోకు భూములు, డొంక పోరంబోకు భూములు వందల ఎకరాల్లో ఉన్నాయి. మంగళగిరి ప్రాంతం రాజధానిగా మారడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను ప్రభుత్వ భూములపై పడింది. అక్రమ రిజిస్ట్రేషన్ల లలో వచ్చిన లాభంలో సబ్ రిజిస్ట్రార్ కు 50శాతం, సహకరించిన అధికారులకు 20శాతం, సకాలంలో రిజిస్ట్రేషన్లు చేయించిన స్టాంపు రైటర్లకు మరో 30శాతం చొప్పున వాటాలు పంచుకున్నట్లుగా చెప్పుకుంటున్నారు. ఇదంతా సబ్ రిజిస్ట్రార్ కు తెలిసే జరుగుతుందని సమాచారం.

### జిల్లా రిజిస్ట్రార్ పేరుతో అదనపు వసూళ్లు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ దందాను జిల్లా రిజిస్ట్రార్ కు మామూళ్ళు వెళ్తున్నాయని విశ్వస నీయ సమాచారం. నీతిగా వ్యవహరించినట్ల యితే గత ఐదేళ్ల కాలంలో కనీసం ముగ్గురు రిజిస్ట్రార్ లు ఈపాటికి సస్పెండ్ అయి ఉండే వారిని స్థానికంగా ఉన్న స్టాంప్ వెండర్స్ చెప్పుకుంటున్నారు. అంతేకాక మ్యారేజ్ సర్టిఫికేట్లు, ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ ల పేరుతో దోపిడీ చేస్తున్నారు.

### పాత స్టాంపులైన, కొత్త స్టాంపులైన అదనపు ఫీజు ఇవ్వాల్సిందే..

మంగళగిరి పరిధిలో పాత స్టాంపుల పేరుతో మరో దందాకు పాల్పడుతున్నారు. చుట్టుప్రక్కల గ్రామాల్లో మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కనిపించే స్టాంపులు చిన్న చిన్న దుకాణాల్లో సైతం కనపడుతున్నాయి. వందరూపాయల స్టాంపును రూ. 150లు, 200 స్టాంపును రూ.300లు, 500 స్టాంపును 1000 రూపాయలు, వెయ్యి రూపాయల స్టాంపును రూ.2వేల చొప్పున ఆక్రమ క్రయవిక్రయదారులకు విక్రయాలు చేస్తూ దందాకు పాల్పడుతున్నారని వినికిడి. ఇవేవి చాలవన్నట్లుగా సొసైటీలో రైతుల భూములు తనఖా పెట్టి లోన్ తీసుకోడానికి రిజిస్ట్రార్ సంతకానికి ఆశ్రయించినపుడు సొసైటీ సిబ్బంది, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది అదనంగా వసూలు చేస్తున్నారనే రైతులు ఆరోపిస్తున్నారు.

### అంతా మా ఇష్టం...

అంతా మా ఇష్టం అడిగేవారు లేరన్నట్లుగా నకిలీ భూములకు పక్క సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేసేసి లక్షలు మింగేస్తున్నారు. ఒరిజినల్ పట్టాకాగితాలుండి మామూళ్ళు ఇవ్వలేని పేదల భూములు రిజిస్ట్రేషన్ కు మాత్రం మామూళ్ళు ఇస్తేనే రిజిస్ట్రేషన్లు చేస్తామని స్టాంపు రైటర్లు సబ్ రిజిస్ట్రార్ పేరుతో లక్షల్లో డిమాండ్ చేస్తూ రిజిస్ట్రేషన్లు జరగకుండా కాకమ్మ కథలు చెప్పి వెనక్కి నెట్టేస్తున్నారు. అదనపు ఫీజు ఇవ్వకపోతే కోర్రిలు పెట్టి రిజిస్ట్రేషన్లు ఆపేస్తున్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఆక్రమంగా రిజిస్ట్రేషన్ల పేరుతో దోపిడీ చేస్తున్న మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ పై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు, సామాన్య ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఎసీబీ అధికారులు మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ పై నిఘా పె ట్టి అక్రమాలకు పాల్పడుతున్న సబ్ రిజిస్ట్రార్, స్టాంపు రైటర్లు, కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకుంటే మంగళగిరి ప్రాంతంలో కొత్తగా దేశ విదేశాల నుండి వచ్చే వ్యాపారస్తులకు, పెట్టుబడిదారులకు, రాష్ట్ర అభివృద్ధికి సహకరించిన వారవుతారు.

# తెనాలిలో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ షోరూమ్ శుభారంభం

## ముఖ్య అతిథులుగా పాల్గొన్న సినీ హీరోయిన్ మీనాక్షి చౌదరి, ఎమ్మెల్సీ ఆలపాటి





**తెనాలి, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో విస్తరిస్తున్న సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వినియోగదారులకు క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పర్వదినాల సందర్భంగా వినూత్నమైన ఫ్యాషన్ ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ, సరికొత్త షాపింగ్ అనుభూతిని పంచే విధంగా తెనాలిలో తన 37వ షోరూమ్ ను శుభారంభం చేసింది. దీనితో ఈ బృహత్తర సంస్థ మరో మ్కెలురాయిని చేరుకొంది. ప్రముఖ సినీతార కుమారి మీనాక్షి చౌదరి (సంక్రాంతికి వస్తున్నాం ఫేమ్) జ్యోతిని వెలిగించి షోరూమ్‌ను మంగళప్రదంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హీరోయిన్ మీనాక్షి చౌదరి మాట్లాడుతూ వైవిధ్యభరితమైన కలెక్షన్స్‌తో పండుగ వాతావరణాన్ని ముందుగానే ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉంది అన్నారు. ఆర్ఎస్ బ్రదర్స్ రిటైల్ ఇండియా లిమిటెడ్ డ్కెరెక్టర్లు తెనాలిలోని షాపింగ్ ప్రియులకు హృదయపూర్వక స్వాగతం పలికారు. కుటుంబంలోని అన్నితరాల వారి అభిరుచుల మేరకు అద్భుతమైన షాపింగ్ అనుభూతిని పంచే విధంగా నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందజేయగలమని హామీ ఇచ్చారు. సంస్థ ఛైర్‌పర్సన్, హెూల్ ట్కెం డ్కెరెక్టర్ పొట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ షోరూమ్ ద్వారా 37వ మ్కెలురాయిని చేరుకోవడం తమకు ఆనందదాయకమన్నారు. తెనాలివాసుల అభిరుచుల్ని ప్రతిబింబించే వెరైటీలను అందించగలమని అన్నారు. సంస్థ మేనేజింగ్ డ్కెరెక్టర్ సీర్ణ రాజమౌళి మాట్లాడుతూ రాబోయే పర్వదినాలకు మరింత శోభనిచ్చే షాపింగ్ అనుభూతిని తమ సరికొత్త షోరూమ్ తప్పకుండా అందజేయగలదని హామీ ఇచ్చారు. హెూల్ ట్కెం డ్కెరెక్టర్ తిరువీధుల ప్రసాదరావు మాట్లాడుతూ తమ షోరూమ్‌లో క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి వేడుకలకు అనువైన వెరైటీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. తెనాలిలోని సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌లో సంప్రదాయం మొదలుకుని సరికొత్త ఫ్యాషన్లను మేళవిస్తూ, కుటుంబంలోని అన్ని తరాల వారినీ అలరించే విధంగా పండుగ చీరెలు, పట్టు వెరైటీలు, మెన్స్‌వేర్, కిడ్స్‌వేర్, ఎత్నిక్ వేర్, ఇండో-వెస్ట్రన్ కేటగిరీలు కనువిందు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తెనాలిలోని సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ నూతన షోరూమ్, సరికొత్త ఫ్యాషన్‌కు మైలురాయిగా నిలుస్తూ, షాపింగ్ అనుభవాన్ని మరింత మెరుగుపరుస్తుందని హామీ ఇస్తోంది. ఈ పండుగ సీజన్‌ను తమ నూతన స్టోర్‌తో ప్రారంభించాలని సంస్థ డ్కెరెక్టర్లు తెనాలి పరిసర ప్రజలను హృదయపూర్వకంగా ఆహ్వానం పలుకుతున్నామని తెలిపారు.

## వాగ్దేవి డిగ్రీ కాలేజీ లో ముగిసిన ఎం ఎస్ ఎం ఈ వర్క్ షాప్ తరగతులు




**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** స్థానిక నరసరావుపేట రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కాలేజీ అటానమస్ నందు వరల్డ్ బ్యాంకు స్పాన్సర్స్ తో ఎంట్రప్రెన్యూనెర్ షిప్ కమ్ స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం క్రింద డిగ్రీ విద్యార్థులకు ఉచితంగా నోడల్ ఏజెన్సీ ఏపీ ఎం ఎస్ ఎం ఈ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వ ర్యంలో వెబ్ డిజైన్, డెవలప్మెంట్ స్కిల్స్ కోర్స్ లో 20 రోజులు పాటు శిక్షణ ప్రోగ్రాం శుక్రవారం తో ముగిసినది. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు వెబ్ సైట్ డెవలప్ చేయడం, ఫ్రంట్ ఎండ్, బ్యాక్ ఎండ్ ప్రోగ్రాం లు నేర్చుకున్నారని, తద్వారా స్వంతంగా వివిధ సంస్థలకు వెబ్ సైట్ లు డెవలప్ చేసి ఉపాధి పొందవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. విద్యార్థులు అభ్యసించే విద్య నైపుణ్యాలతో కూడి ఉండాలనీ, అటువంటి విద్య మాత్రమే ఉద్యోగ ఉపాధి అవకాశాలు సాధించడానికి దోహదపడుతుందని కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటిడి కన్సల్టెంట్ సయ్యద్ హంజల్ హుస్సేన్, స్కిల్ హబ్ నిర్వాహకులు ప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సిఐటిడి డైరెక్టర్ వెంకటకృష్ణ సూచనలతో 20 రోజుల పాటు కళాశాలలో ఎం.ఎస్.ఎం. శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు కి రానున్న రోజుల్లో వెబ్ డెవలప్మెంట్ టెక్నాలజీ లో మంచి అవకాశంలు ఉన్నాయి. ఈ అవకాశం కల్పించిన కళాశాల యాజమాన్యానికి విద్యార్థులు ధన్య వాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కాట్ల రామకోటేశ్వర రావు, కళాశాల డైరెక్టర్ ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూధా సురేష్ బాబు, పాశం కృష్ణారావు, ఇస్కెపల్లి కృష్ణ కిషోర్ మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం




**గుంటూరు రూరల్ మేజర్ న్యూస్ :** జొన్నలగడ్డ గ్రామంలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, వ్యవసాయ కళాశాల బాపట్ల వారు ప్రారంభించిన జాతీయ సేవాపథకం ప్రత్యేక శిబిరం శుక్రవారం ముగిసింది. చివరి రోజు కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలు, రైతుల ముఖాముఖి చర్చా గోష్ఠి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా॥ ఎమ్. రమాదేవి, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మాట్లాడుతూ.. రైతులకు పంటలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు మరియు రైతులకు సేద్యవు పద్ధతులలు గురించి పురుగలు, తెగుళ్ళు నివారణకు సమగ్ర పురుగులు, తెగుళ్ళ యాజమాన్యం గురించి వివరించినారు. అనంతరం గ్రామరైతుల పొలాలకు (మినుము, ప్రత్తి) వెళ్ళి పంటలను పరిశిలించడం జరిగింది. మినుము పొలంలో పల్లాకు తెగులు, బూడిద తెగులును గమనించడం జరిగింది మరియు వాటి నివారణ చర్యలను గురించి రైతులకు తెలియచేసినారు. తెల్లదోమ, తామారపురుగు నివారణకు పసుపు మరియు నీలిరంగు అట్టలను ఏకారకు 15-20 వరకు పెట్టుకోవాలని తెలియ చేసినారు. అనంతరం రైతులకు పసుపు రంగు అట్టలను ఉచితంగా పంపిణి చేసినారు. ఈ కార్యక్రమంలో 52 మంది వాలెంటీర్లు, గ్రామ రైతులతో కలిసి సమగ్ర పురుగులు, తెగుళ్ళు యాజమన్యం మరియు సమగ్ర పోషక యాజమాన్యం గురించి నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలి నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చివరి అంకంగా ఎన్.ఎస్.ఎస్ వాలెంటీర్లు ఈ కార్యక్రమం గురించి వారు ఏమి నేర్చుకున్నారు అని మాట్లా డించినారు మరియు గ్రామప్రజలు ఎన్.ఎస్.ఎస్ కార్యక్రమం గ్రామంలో నిర్వహించినందుకు ధాన్యావాదాలు తెలియజేసినారు మరియు ఈ ఎన్.ఎస్.ఎస్ క్యాంపు వాళ్ళకు బాగా ఉపయోగపడింది అని తెలియచేశారు. భారత వ్యవసాయ పరిశోదన మండలి భారతీయ నూనె గింజల పరిశోదన సంస్థ రాజేద్రనగర్, హైదరాబాద్ వారు షెడ్యుల్ట్ కులాల ఉప ప్రణాలిక పథకం ద్వారా 25 మంది రైతులకు టార్పాలిన్ పట్టలను గ్రామములో పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో / టి.కీర్తిక యంగ్ ప్రొఫెషనల్ - II IIOR. ఈ కార్యక్రమంలో డా॥. జి బిందు మధావి ప్రొఫిసర్ పాధాలజీ, డా॥ ఎమ్ ఉపా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎక్స్టెన్షన్ గ్రామ ఉప సర్పంచ్ మాజీ వి.నవీన్ రెడ్డి, ఎన్.ఎస్.ఎస్ వాలెంటీర్లు, గ్రామ ప్రజలు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## లే అవుట్లు అనుమతులు తప్పనిసరి
### - కమీషనర్ అప్పలనాయుడు



**తెనాలి మేజర్ న్యూస్ :** పట్టణ శివారు ప్రాంతం గోలిడొంకలోని లే అవుట్లు మున్సిపల్ కమీషనర్ అప్పలనాయుడు శుక్రవారం పరిశీలించారు. ఆ ప్రాంతంలోని మూడు లే అవుట్లు సందర్శించి వాటి రికార్డులను పరిశీలించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణిను అడిగి వివరాలు తెలుసుకున్నారు. లే అవుట్ల అనుమతులు ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. లే అవుట్ యజమానులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

## ఎమ్మెల్యే ప్రజా వేదిక కు విశేష స్పందన



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదిక కు విశేష స్పందన లభించింది. పట్టణంలోని వివిధ వార్డులతో పాటు, నియోజకవర్గ పరిధిలోని గ్రామాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు ప్రజా వేదిక కు హాజరయ్యారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, ఆస్తి పన్ను, పింఛన్లు, రేషన్ కార్డులు జారీ, వైద్య సహాయం, ఇండ్ల పట్టాలు తదితర అంశాలపై దాదాపు 50కు పైగా అర్జీలను శాసనసభ్యులు స్వీకరించారు. అర్జీలు అందజేస్తున్న ప్రతి ఒక్కరితోనూ ఎమ్మెల్యే అరవింద బాబు స్వయంగా మాట్లాడి సమస్యల వివరాలు తెలుసుకున్నారు. కొన్ని సమస్యలకు వెంటనే అధికారులకు ఫోన్ చేసి పరిష్కారం కోసం ఆదేశాలు జారీ చేశారు. మిగతా అర్జీలను సంబంధిత శాఖలకు పంపి, రెండు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

## డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ని ఘనంగా సన్మానించిన రుద్రపాటి హుస్సేన్



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లో ఇటీవలే పదవి పొందిన పల్నాడు జిల్లా పెద్దకూరపాడు నియోజకవర్గా నికి చెందిన రుద్రపాటి హుస్సేన్ శుక్రవారం నరసరా వుపేట గుంటూరు రోడ్ లోని వైయస్సార్సీపి కార్యాలయం లో మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు,ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి యువ జన విభాగం జిల్లా కార్యదర్శి వజ్రాల శ్రీనివాస్ రెడ్డి రెడ్డి సోషల్ మీడియా జిల్లా విభాగ కార్య దర్శి గుడిసె నాగిరెడ్డి యూత్ నాయకులు గోపి అంకారావు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి హుండీ లెక్కింపు



**గుంటూరు రూరల్ మేజర్ న్యూస్ :** గుంటూరు రూరల్ గోరంట్ల గ్రామంలోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం హుండీని లెక్కించారు. మొత్తం 80 రోజుల వ్యవధిలో భక్తులు కానుకల రూపంలో రూ.9,15,890లు సమర్పించినట్లు ఆలయ ఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. భక్తులు తమ కానుకలను హుండీలో మాత్రమే సమర్పించాలని ఈవో సూచించారు.

**ఎన్.లక్ష్మినారాయణ, రీజనల్ మేనేజర్, ఫోన్ నెం. 63011 07116**

## స్పోర్ట్స్ కిట్స్ అందించిన శ్రీ సిమెంట్ ఫ్యాక్టరీ జి.యం.శ్రీనివాస్



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్, మండల పరిషత్ స్కూల్ నందు స్పోర్ట్స్ కిడ్స్ శ్రీ సిమెంట్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీ వారు అందించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ సిమెంట్స్ ఫ్యాక్టరీ జిఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. తుమ్మలచెరువు గ్రామంలో ఉన్న జడ్పీహెచ్ స్కూల్ కు ఒక గది నిర్మాణానికి, మండల పరిషత్తు స్కూల్ నందు ఫ్లోరింగు మాల్స్ కు సుమారుగా రూ. 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సిమెంట్ ఫ్యాక్టరీ జిఎం శ్రీనివాస్, అడిషనల్ జిహెచ్ ఆర్ లక్ష్మీనారాయణ పాఠశాల అధ్యాపకులు, తుమ్మల చెరువు కోటమి నాయకులు పాండురంగారావు, గురుమూర్తి, ఏడుకొండలు, అశోక్ నాగరాజు, గురుమూర్తి,చంద్రం, వంశీ, లక్ష్మి కోటయ్య,బాబు, ఎర్ర అబ్బాయి, కరిముల్లా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాచవరం ఎంపీపీని సన్మానించిన టీడీపీ నాయకులు



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** పిడుగురాళ్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు పాత్రికేయుల సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంలో గురజాల శాసన సభ్యులు యరపతినేని శ్రీనివాసరావు సహకారంతో మాచవరం మండల ఎంపీపీగా ఎన్నికైన కొక్కెర అంజమ్మ ని ఘనంగా సన్మానించి అభినందించటం జరిగినది. శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు బీసీలకు ప్రాధాన్యతనిస్తూ పార్టీ, ప్రభుత్వ పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని పాల్గొన్న నేతలు ఎమ్మెల్యే ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల కన్వీనర్లు, నియోజకవర్గ నాయకులు, జిల్లా నాయకులు, ముఖ్య నాయకులు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## నందులపేట ఆరోగ్యకేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



**తెనాలి మేజర్ న్యూస్ :** స్థానిక నందుల పేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి, ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో సెమీ క్రిస్టమస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం అధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ఎస్ హెచ్ఐ గుద్దంటి రవికుమార్, మలేరియా, ఫైలేరియా సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక క్రిస్మస్ కేక్ ను కట్ చేసి క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ క్రీస్తు చెప్పిన ప్రేమ, జాలి, దయ, కనికరం వంటి బోధనలు అనుసరణీయమని అన్నారు. ఒకరి ఎడల ఒకరు ప్రేమ కలిగి సమైక్యంగా, సోదర భావంతో జీవించాలని ఆమె కోరారు. అందరూ కలిసి ఇటువంటి కార్యక్రమాలు చేసుకోవడం వల్ల స్నేహ సంబంధాలు పెరుగుతాయని అన్నారు. కార్యక్రమాంలో హెల్త్ విజిటర్ చింతల ప్రసన్న పుష్పలత, టిబిసూపర్వైజర్ రవికుమార్, సూపర్వైజర్స్ దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, తిరువీధుల శివరామ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్స్ ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు మెరుగైన వైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి




**తెనాలి మేజర్ న్యూస్ :** మండల లీగల్ సెల్ కమిటీ ఆధ్వర్యంలో కొత్తపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విశ్వజనిత ఆరోగ్య పరిరక్షణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పారా లీగల్ వాలెంటరీ తాడిబోయిన శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్యం సర్వ మానవాళి ప్రాథమిక హక్కు అన్నారు. ప్రతి మనిషికి మెరుగైన వైద్య, నివాస, ఉపశమన సేవలను అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. లీగల్ వాలెంటరీ ఖజామోహిద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ద్వారా పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చిందని ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిపిఐ శత వార్షికోత్సవాలు జయప్రదం చేయండి



### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు

### సిపిఐ పార్టీ జెండాని ఆవిష్కరించిన సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య






**నరసరావుపేట మేజర్ న్యూస్ :** సిపిఐ శత వార్షికోత్సవాలు జయప్రదం చేయలని సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు పిలుపునీచారు. నరసరావుపేట బరంపేట సెంటర్ దగ్గర సిపిఐ శత వార్షికోత్సవ సందర్భంగా జెండాని సిపిఐ సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ పోతంశెట్టి ఆంజనే యులు కి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కాసర్ రాంబాబు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ భారత గడ్డపై 1925 డిసెంబర్ 26న స్థాపించారు. డిసెంబర్ 26 నాటికి వందేళ్లు పూర్తి చేసుకుంటుందని, ఈ 100 సంవత్సరాల్లో ఎన్నో పోరాటాలు ఎన్నో త్యాగాలు ఎన్నెన్నో ప్రజా సమస్యలు పరిష్కారం చేసినటువంటి చేస్తున్నటు వంటి పార్టీ సిపిఐ అని అన్నారు. భూమికోసం భుక్తి కోసం ప్రజల విముక్తి కోసం దున్నేవానికి భూమి కావాలని పోరాటాలు కొనసాగించిన పార్టీ సిపిఐ. తెలంగాణ సాయుధ పోరాటం కేరళలో రైతాంగ పోరాటం నడిపినట్టు పార్టీ సిపిఐ అన్నారు. సిపిఐ ఏరియా కార్యదర్శి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ నరసరావుపేట నియోజక వర్గంలో అనేక భూ పోరాటాలు అనేక కాలనీ లను నిర్మాణాలు చేసినటువంటి పార్టీ సీపీఐ అని బరంపేట లో మాజీ కౌన్సిలర్ పోతంశెట్టి ఆంజనేయులు ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు రోడ్లు నిర్మాణం అనేక అభి వృద్ధి పనులు చేసిన ఘనత సిపిఐ కి దక్కుతుందని అన్నారు. నాగార్జునసాగర్ కోసం ఎన్నో పోరాటా లు నిర్వహించిందని రైతాంగ కార్మిక కర్షక మహిళా విద్యార్థి యువజన సంఘం ఏర్పాటు చేసి వాళ్ళ హక్కుల కోసం నిలబడినటువంటి పార్టీ సిపిఐ అన్నారు. డిసెంబర్ 22 నరసరావు పేట నియోజక వర్గ శాతవార్షికోత్సవ సభ జరుగుతుందని ఈ సభలో రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొంటారని కావునయావన్మంది పార్టీ సభ్యు లు పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్య దర్శి ఎస్కె చిన్న జాను సైదా, సిపిఐ సీనియర్ నాయకులు ఉప్పల పాటి రంగయ్య, చిట్యాల శ్రీనివాసరెడ్డి, రాజ దేవి, కాలిక జ్యోతి, స్వాతి అంకమ్మరావు, అంకమ్మ వెంకాయమ్మ, పద్మ , తదితరులు పాల్గొన్నారు.

# దశాబ్దాల వైరాన్ని నెరవేర్చిన - ధూళిపాళ్ల



**పెదకాకాని మేజర్ న్యూస్ :** పొన్నూరు నియోజకవర్గం పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామంలోని బాల యేసు నగర్ కాలనీలో కొంత ప్రభుత్వ భూమి (కమ్యూనిటీ స్థలం) ఉంది. ఇదే భూమిలో ఈద్గా సైతం ఉంది. దీంతో ఆ స్థలం తమదేనంటూ బాల యేసు నగర్ కాలనీ వాసులకు మరియు స్థానిక ముస్లిమ్స్ మధ్య వివాదం నడుస్తోంది. ఈ వివాదాలు పై కొన్నేళ్ల క్రితం పోలీసులు కేసులు నమోదు చేయటం కూడా జరిగింది. అప్పటినుంచి ఈ వివాదం పరిష్కారానికి నోచుకోలేదు. ఈ వివాదాన్ని అడ్డుపెట్టుకొని గ్రామాములో గొడవలు సృష్టిచడం సైతం చేసిన ఘటనలు చాలా ఉన్నాయి. జనరల్ ఎన్నికల ప్రచార సమయంలో ఈ సమస్యను పరిష్కరించాలిని కూటమి అభ్యర్థి అయిన ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ దృష్టికి ఇరుమతాలు తీసుకురాగ ఎన్నికలు అయిపోయిన తర్వాత ఈ సమస్యను పరిష్కరిస్తానని ఇరువర్గాలకు హామీ ఇచ్చినారు. హామీని నెరవేర్చలనే సదుద్దేశంతో ఎన్నికల అనంతరం నరేంద్రకుమార్ మరియు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామ పెద్దల సమక్షంలో ఇరువర్గాల వారితో చర్చించి సమస్య ఓపిక గా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే గారు ఇరువర్గాల వారితో చర్చలు జరిపి సమస్య ను సఫలం అయ్యేటట్లు చేసినారు. ఈదుగాకు కేటాయించిన స్థలంతో పాటు కొంత స్థలాన్ని మైనార్టీ సోదరులు ప్రార్ధనలు చేసుకునేందుకు 8 సెంట్లు స్థలంను ఇచ్చేందుకు ఎస్సీ మాదిగ సోదరులను ఒప్పించి ఇరు వర్గాల వారు అంగీకరించే విధంగా చేశారు. ఇరువర్గాల అంగీకారంతో పంచాయతీలో తీర్మానం ఆమోదీప చేయెంచి తీర్మాన కాపీని స్థానిక తహసీల్దార్ కి పంపారు. పంచాయతీ తీర్మానం పై తహసీల్దార్ ఎవరు ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో అధికారికంగా స్థలం కేటాయిస్తూ ఉత్తర్వులు కాపీని ఈ రోజు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మరియు తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రావణ కుమార్ సమక్షంలో ఇరువర్గాల వారికీ అందచేసినారు. ఈ సందర్భంగా ఇరువర్గాల వారు దశబ్దాల కాలంగా నెలకొన్న వివాదానికి పరిష్కారం చూపిన ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎస్సీ సోదరులు, ముస్లిమ్స్ సోదరులు, ప్రభుత్వ అధికారాలు పాల్గొన్నారు.

# ఫుట్ పాత్ లను ట్రక్ మౌంటెడ్ లిట్టర్ పికర్ మెషిన్ వేగంగా శుభ్రం చేస్తుంది



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పెద్ద రోడ్లు, డివైడర్లు, ఫుట్ పాత్ లను ట్రక్ మౌంటెడ్ లిట్టర్ పికర్ మెషిన్ వేగంగా శుభ్రం చేస్తుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం అమరావతి రోడ్ లోని మధురా నగర్ ప్రాంతంలో లిట్టర్ పికర్ మెషిన్ పనితీరును జిఎంసి ఎస్ఈ (సుందర్రామిరెడ్డి)తో కలిసి కమిషనర్ నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ట్రక్ మౌంటెడ్ లిట్టర్ పికర్ మెషిన్ ద్వారా పెద్ద రోడ్లు, డివైడర్లు, ఫుట్‌పాత్‌లలో పడివున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, కాగితాలు, ఆకులు, చిన్నచెత్తను 10 మీటర్ల పొడవైన హెూస్‌తో శక్తివంతమైన సక్షన్ ద్వారా ఒకేసారి 3000 లీటర్ల (3 టన్నుల) హాపర్‌లో సేకరిస్తుందన్నారు. మాన్యువల్ స్వీపర్ల బదులు కేవలం డ్రైవర్, ఆపరేటర్ ఇద్దరితోనే పని పూర్తవడం వల్ల కార్మికుల శ్రమ బాగా తగ్గుతుందన్నారు. ముఖ్యంగా ఉదయం ట్రాఫిక్ రద్దీ సమయాల్లో వేగంగా శుభ్రం చేయడానికి దోహదపడుతుం దని పేర్కొన్నారు. ప్రధానంగా బస్టాండ్, రైల్వే స్టేషన్, మార్కెట్ జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాలు, పార్కులు, డ్రైన్ల పక్కన పడిన చెత్త, వర్షాల అనంతరం రోడ్లపై పేరుకుపోయిన ఆకులు, మట్టిని సులువుగా తొలగించవచ్చన్నారు. ఒక ట్రిప్‌లోనే 4–5 సాధారణ ట్రక్ ల పని పూర్తవడం వల్ల సమయం, ఇందనం ఆదా అవుతాయన్నారు. మరో పర్యాయం సదరు మెషిన్ పనితీరుని పరిశీలించి, నగరపాలక సంస్థ మేయర్ నేతృత్వంలోని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి వాటిని నగరంలో వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## దుర్గి మార్కెట్ యార్డ్ చైర్మన్ గా - లింగా బ్రహ్మయ్య

- ఉత్తర్వులు జారీ చేసిన కూటమి ప్రభుత్వం
- దుర్గి వ్యవసాయ మార్కెట్ యార్డ్ కొత్త కమిటీ నియామకం

**దుర్గి మేజర్ న్యూస్ :** దుర్గి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు కొత్త కమిటీ నియామకాలపై ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. లింగా బ్రహ్మయ్యను చైర్మన్‌గా, మరో 18 మంది సభ్యులను కమిటీ సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు విడుదల చేసింది. ఈ సందర్భంగా తనను చైర్మన్‌గా నియమిస్తూ విశ్వాసం ఉంచిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి లకు లింగా బ్రహ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు. రైతుల ప్రయోజనాలను కాపాడుతూ, మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

## నిరుద్యోగ యువతీ, యువకులకు కూటమి ప్రభుత్వం అండ







**పొన్నూరు మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వి.ఎన్.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో విజయవంతంగా మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించబడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు సంగం డైరీ చైర్మన్ ధూళిపాల నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ జాబ్ మేళా నిర్వహించబడినందున యువత ముందుకు వచ్చి, తమ నైపుణ్యాలను పెంచుకుని ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపిక కాకపోయిన అభ్యర్థులకు ప్రభుత్వం ఉచిత శిక్షణ కార్యక్రమాలను అందిస్తోందని, శిక్షణ అనంతరం మరిన్ని అవకాశాలు దక్కుతాయని తెలియజేశారు.జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కే. సంజీవరావు మాట్లాడుతూ, 36 కంపెనీల ద్వారా సుమారు 860 ఉద్యోగావకాశాలు కల్పించడమైనదని, యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని మంచి భవిష్యత్తు కోసం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. వెలగా పద్మ రావు , జాయింట్ డైరెక్టర్, టెక్నికల్ ఎడ్యుకేషన్ మాట్లాడుతూ పొన్నూరు లో నిర్వహించిన ఈ జాబ్ మేళాలో యువతి, యువకులు తమ నైపుణ్యాల ద్వారా ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వం ద్వారా అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను ఉపయోగించుకుని తమ నైపుణ్యాలలో మెరుగుపరుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపికైన అభ్యర్థులకు స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా నియామక పత్రాలు అందించడమైనది. ఈ జాబ్ మేళాలో మొత్తం 36 కంపెనీలు పాల్గొనగా, 510 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 215 మంది అభ్యర్థులు ఉద్యోగాల కోసం ఎంపిక చేయబడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యం.రమేష్ బాబు, ఎంపీడీవో సిహెచ్. చంద్రశేఖర్ రావు , జడ్పీటీసీ పెద్దకాకాని మురళి, స్థానిక ప్రజాప్రతినిధులు, నైపుణ్య అభివృద్ధి సిబ్బంది కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# పల్నాటి పౌరుషం చూపించిన వైసిపి ఎంపీటీసీలు

❖ మా పోరాటం పోలీసులతోనే
❖ మాజీ ఎమ్మెల్యే కాసు

**మాచవరం మేజర్ న్యూస్ :** మాచవరం మండలంలో శుక్రవారం జరిగిన మండల పరిషత్ అధ్యక్షులు ఎంపీపీ ఎన్నికల్లో టిడిపి నాయకుల ప్రలోభాలకు లొంగకుండా నమ్ముకున్న పార్టీ కోసం పని చేసిన మాచవరం మండల వైసీపీ ఎంపీటీసీలను గురజాల మాజీ శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా కాసు మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమని నమ్ముకున్న పార్టీ సిద్ధాంతం కోసం పోరాడే వాడే నాయకుడని అటువంటి నాయకుల కోసం ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందని కాసు మహేష్ రెడ్డి అన్నారు. మాచవరం గంగిరెడ్డిపాలెం మల్లవోలు మొర్జంపాడు గ్రామాల ఎంపీటీసీలను శాలువాతో ఘనంగా సన్మానించారు. తమ పోరాటం టిడిపి నాయకులతో కాదని, పోలీసులతో నని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మల్లవోలు ఎంపీటీసీ చుక్క సువార్త స్వగృహం నందు ఆయన మాట్లాడారు. పోలీసులు బెదిరింపులకు పాల్పడిన ఐదుగురు వైసీపీ ఎంపీటీసీలు ఎంపీపీ ఎన్నికలు పాల్గొన్నారు. మల్లవోలు ఎంపిటిసి సుక్క సువార్తమ్మ పల్నాటి పౌరుషం చూపించి, టిడిపి ఎన్ని ప్రలోభావాలు చూపించిన లొంగక వైసిపి పార్టీ టికెట్ ఇచ్చింది ఆ పార్టీలోనే ఉంటానని మల్లవోలు ఎస్సీ కాలనీకి చెందిన ఆమె వైసిపి ఎంపీపీ అభ్యర్థికి మద్దతు తెలిపారని ఆయన అన్నారు. మాచవరం, గంగిరెడ్డిపాలెం, మొర్జంపాడు, మల్లవోలు ఎంపిటిసిలు వైసీపీకి మద్దతు తెలిపారు అని ఆయన అన్నారు. కట్టుబడి ఉన్న ఎంపీటీసీలకు, కష్టపడ్డ వైసిపి కార్యకర్తలకు రాబోయే కాలంలో పార్టీ అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మద్దు ప్రసాద్, జడ్పిటిసి జువ్విన బోయిన శివ యాదవ్, వైసిపి మండల్ యూత్ అధ్యక్షులు



ముండ్లపాటి చిన్న ఆంజనేయులు వైసిపి జిల్లా కార్యదర్శి జలుబు వెంకట నరసింహారెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గారపాటి సింగరయ్య, వైసిపి మండల ఉపాధ్యక్షులు చింతారెడ్డి పుల్లారెడ్డి, బాల కోటేశ్వరరావు, గురజాల నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షులు కావాటి కిషోర్, మండల కో ఆప్షన్ మెంబర్ షేక్ మహమ్మద్ జానీ, ,మాజీ మండల కన్వీనర్లు చౌదరి సింగరయ్య, గుర్రం గురువారెడ్డి, వైసిపి మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి, వైసీపీ సర్పంచులు రాగిడి నరేష్, బిట్రా కరుణమ్మ డేవిడ్, అలవాల లక్ష్మి స్వామి, పెరుగు రోసయ్య, స్వామి, అనిల్ కుమార్, మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ సింగడాల శ్రీనివాసరావు, నల్ల మేకల తిరుపాల్, అయ్యప్ప, మద్దు చందు, జక్కి రామాంజనేయులు, వైసిపి అనుబంధ విభాగాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా లో రబీ సీజను కు సరిపడా యూరియా అందుబాటులో ఉంది

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** రబీ 2025-26గాను, జిల్లాలోని అన్ని పంటలకు 55840 మెట్రిక్ టన్నుల యూరియా ఎరువు అవసరంగా గుర్తించి పంపిణీకి ప్రణాళిక రాష్ట్ర వ్యవసాయ సంచాలకులవారికి పంపడం చేయడమైనది. అక్టోబర్ 2025 నాటికి 1770 మెట్రిక్ టన్నుల యూరియా ప్రారంభనిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఏడాది అక్టోబర్ నుండి 31.12.20252 2 24996 వరకు అవసరం కాగా, ఇప్పటికే 28084 మెట్రిక్ టన్నుల యూరియా ను రైతులకు అందుబాటులో ఉంచడం జరిగింది మరియు ఈ డిసెంబర్ ఆఖరికి ఇంకనూ 8000 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానున్నది.జిల్లాలో 01.10.2025 నుండి 11.12.2025వరకు రాష్ట్రం లో మొత్తం 18194 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగినవి 11.12.2025 నాటి నుండిరాబోయే 21 రోజులకుగాను 7000 మెట్రిక్ టన్నుల యూరియా అవసరంకాగా, ప్రస్తుతం 9890 మెట్రిక్ టన్నులను యూరియా ను కో ఆపరేటివ్ సొసైటీలలో, ఆర్.ఎస్.కె లలో, మార్క్ ఫెడ్ గోదాములలో, రిటైల్/హోల్ సేల్, మరియు కంపెనీ గోదాములలో ఎరువునురైతాంగానికి అందుబాటులో ఉన్నవి. జిల్లాలో ఇప్పటివరకు ఎటువంటి ఎరువుల కొరత లేదు. దేశీయంగా ఉన్న అన్ని ఎరువుల కర్మాగారాలు ఉత్పత్తి చేయుచున్నది. అలాగే విదేశాలనుండి కూడా అవసరమైన యూరియా దిగుమతులు సంతృప్తి కరంగా ఉన్నవి. కనుక రాబోయే పంట కాలం లో కూడా యూరియా కు ఎటువంటి కొరత రాదని తెలియపరచడమైనది.నూతనంగా రూపొందించి బడిన సాంకేతికంగా అభివృద్ధి పరిచిన నానో యూరియా నానో డి.ఎ.పి ఎరువులను అందుబాటులోకి తీసుకురావడం జరిగినది. ఇవి సాంప్రదాయ ఎరువులకు నూరు శాతం ప్రత్యామ్నాయంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని ప్రోత్సాహిస్తున్నాయి. కావున, రైతు సోదరులకు తెలియచేయడం ఏమనగా, ఎరువులను కొనుగోలు చేయునప్పుడు బస్తా పై ముద్రించిన ఎం.ఆర్.పి దరలను చూసుకుని, దాని ప్రకారము పైకము చెల్లించి, తప్పని సరిగా డీలరు నుండి రసీదు పొందవలెను. ఎవరైనా డీలర్లు నిబంధనలు ఉల్లంఘించి, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా ,ఎరువులను మళ్లింపుచేసిన, ఎం ఆర్ పి ధరల కంటే ఎరువులను అధిక ధరలకు విక్రయించిన ఎడల, వారి లైసెన్స్ లు రద్దు చేసి, ఎరువుల నియంత్రణ చట్టం 1985, ప్రకారంవారిపై కఠిన చర్యలు తీసుకొనబడును అని జిల్లా వ్యవసాయ అధికారి యమ్. పద్మావతి తెలియచేయడమైనది.

# అన్నదాన కార్యక్రమం నిర్వహించి, ఇరుముడితో శబరిమల బయలుదేరిన 30 మంది అయ్యప్ప స్వాములు



**రాజుపాలెం మేజర్ న్యూస్ :** మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో శుక్రవారం 30 మంది అయ్యప్ప స్వాములు ఇరుముడి ధరించి శబరిమల బయలుదేరిన సందర్భంగా గ్రామంలోని శివాలయంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శుక్రవారం ఉదయం 6 గంటల నుండి గ్రామంలోని మాల ధరించిన అయ్యప్ప స్వాములు కుటుంబ సభ్యులతో మరియు బంధువులతో కలిసి స్వాములందరూ గ్రామంలోని శివాలయం వద్దకు ఊరేగింపుగా వచ్చి, ఇరుముడి కట్టించుకుని, శబరిమల బయలుదేరి వెళ్లారు, గ్రామంలోని ప్రజలందరూ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా శ్రీ అన్నపూర్ణ సహిత మరకత కాశీ విశ్వేశ్వరాలయంలో (శివాలయంలో) ఉదయాన్నే పూజా కార్యక్రమాలు అభిషేకాలు నిర్వహించి స్వాములకు తీర్థప్రసాదాలు ఇవ్వడం జరిగింది.

# పార్టీ బలోపేతానికి జనసైనికులు కృషి చేయాలి




**గుంటూరు రూరల్ మేజర్ న్యూస్ :** పార్టీ బలోపేతానికి జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గదె వెంకటేశ్వరరావు కోరారు. గుంటూరు మండలం లాలుపురం గ్రామంలో శుక్రవారం "చాయ్ విత్ జనసైనిక్" కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలు వెల్లడించారు. ఎలాంటి సభ, తీర్మానం లేకుండానే గ్రామాన్ని నగరపాలక సంస్థలో విలీనం చేయటానికి సన్నాహాలు చేయటం సబబు కాదంటూ కొందరు అగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని రకాల అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్గా నియమితులైన చింత రేణుక రాజును జనసేన పార్టీ నాయకులు కాటూరి శీను మాస్టర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# గంజాయి కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్

## నిందితుల వద్ద 1.150 కిలోల గంజాయిని సీజ్




**గుంటూరు క్రైమ్ మేజర్ న్యూస్ :** అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాల రవాణా, విక్రయాలను అరికట్టేందుకు గుంటూరు జిల్లా ఎస్పీఆదేశాల మేరకు, సడీపీవో %-%వెస్ట్ కె. అరవింద్ పర్యవేక్షణలో, అరండల్ పేట ఇన్స్పెక్టర్ కె. ఆరోగ్య రాజు సిబ్బందితో కలిసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.దీనిలో బాగంగా గురువారం బ్రాడిపేట 1వ లైనులోనీ నిర్మానుష ప్రదేశంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని అరండల్ పేర సీఐ రాబడిన సమాచారం మేరకు మధ్యాహ్నం సుమారు 1:15 గంటలకు సమయంలో సదరు ప్రదేశంలో ముగ్గురు అనుమానాస్పద వ్యక్తులు తెల్లని ప్లాస్టిక్ కవర్‌తో నిలిచి ఉండటం గమనించి, వారిని ఆపడానికి ప్రయత్నించగా వారు పారిపోవడానికి యత్నించారు. వెంటనే సీఐ వారి సిబ్బందితో కలిసి వారిని చుట్టుముట్టి పట్టుకున్నట్లు తెలిపారు.సదరు స్థలంలోనే తూకం వేసినప్పుడు వారి వద్ద 1.150 కిలోల గంజాయి ఉన్నట్లు ధృవీకరించబడింది. ఇది ఎన్ డి పి హెచ్ ఎస్ చట్టం ప్రకారం నిషేధిత పదార్థం కావడంతో దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.ఈ దర్యాప్తులో పట్టుబడిన నిందితులు అయిన బొంగరాలు బీడు కు చెందిన పాలపర్తి.కిరణ్,నంద్యాల జిల్లా నంద్యాలకు చెందిన కట్రవత్. సందీప్ నాయక్,కట్రవత్. సంపత్ నాయక్ ముగ్గురు వ్యక్తులు అరకు సమీపంలోని పాడువ గ్రామానికి చెందిన 'డాన్' అనే వ్యక్తి నుండి 3 కిలోల గంజాయిని, రూ.15,000కు కొనుగోలు చేసినట్లు తెలిపారు. అందులో 2 కిలోలు చిన్న పొట్లాలుగా విక్రయించి, మిగిలిన 1 కిలోను అమ్మడానికి గుంటూరు పట్టణానికి తీసుకువచ్చినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. నిందితులను శుక్రవారం రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచిన్నట్లు తెలిపారు. ఈ కేసును విజయవంతంగా చేధించినందుకు అరండల్ పేట ఇన్స్పెక్టర్ కె.ఆరోగ్య రాజు ని, అలాగే కేసులో పాల్గొన్న పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుళ్లు మల్లిఖార్జున రావు, భూపతి, మస్తాన్ వలి, కానిస్టేబుల్ సేతులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ , వెస్ట్ డీస్పీ కె. అరవింద్ అభినందించారు.